

▲ తోట్లవల్లూరు మండలం మధునాపురం వద్ద గోతులతో ప్రమాదకరంగా ఉన్న కరకట్ట

ప్రమాదానికి దారులు

జిల్లాలోని రహదారులపై ప్రయాణం ప్రమాదకరంగా మారింది. అడుగుకో గొయ్యితో అస్తవ్యస్తంగా దర్శనమిస్తున్నాయి. కనీస మరమ్మతులైనా చేయండి మహాప్రభో.. అంటూ ప్రజలు వేడుకుంటున్నా పట్టించుకునేవారు కరువయ్యారు. కొద్దిపాటి వర్షం కురిస్తే రహదారులపై వర్షపునీరు నిలిచి ఎక్కడ గోతులున్నాయో, ఎక్కడ రోడ్డు ఉందో తెలియని పరిస్థితి ఏర్పడింది. జిల్లాలో రాష్ట్ర, జిల్లా రహదారులు 2,786.50 కిలోమీటర్ల మేర ఉండగా, సగానికి పైగా గోతులమయంగానే ఉండటం గమనార్హం. - ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం

దారుణంగా జిల్లాలోని రహదారులు

తుఫాను, భారీ వర్షాల తాకిడికి అస్తవ్యస్తం

- గుంతలు పడి.. కంకర లేచి.. తారు కొట్టుకుపోయి..
- చాలాచోట్ల నిధులు విడుదలైనా పనుల్లో జాప్యం
- ప్రమాదాలకు గురవుతున్న వాహనచోదకులు
- పట్టపగలూ ప్రయాణానికి నరకయాతనే..
- మరమ్మతులు చేయించాలంటున్న స్థానికులు



పమిడిముక్కల మండలం కపిలేశ్వరపురంలో ఆర్‌అండ్‌బీ రోడ్డు పరిస్థితి ఇది

మచిలీపట్నం మండలం చిన్నాపురం-కమ్మవారిచెరువు రహదారి దుస్థితి



వివిధ ప్రాంతాల్లో రహదారుల దుస్థితి ఇలా..

- మచిలీపట్నం-కమ్మవారిచెరువు వయా చిన్నాపురం రహదారి విస్తరణ పనులను ఐదేళ్ల క్రితం ప్రారంభించారు. ఉన్న రోడ్డును పగలగొట్టారు. అనంతరం వేర్వేరు కారణాలతో ఈ పనులు నిలిపివేశారు. ఈ ఏడాది సంభవించిన వాయుగుండం, మొంథా తుఫాను కారణంగా ఈ రహదారి గుంతలమయంగా మారింది. ఏడు కిలోమీటర్ల రహదారికి మరమ్మతులు చేసేందుకు రూ.6 కోట్ల అంచనాలు రూపొందించారు. మచిలీపట్నం-కమ్మవారిచెరువు వయా కోన రహదారి 3.630 కిలోమీటర్ల మేర రూ.3 కోట్లతో మరమ్మతులు చేసేందుకు అనుమతులు ఇచ్చారు. ఎప్పటికి పనులు చేస్తారో తెలియని దుస్థితి నెలకొంది.

- పామర్రు నుంచి చల్లపల్లి వరకు 27.2 కిలోమీటర్ల మేర రహదారి ఉంది. ఇది రాష్ట్ర రహదారి. పామర్రు వద్ద జాతీయ రహదారి 216-ఏకు అనుసంధానం చేసి, జాతీయ రహదారుల ప్రమాణాలతో అభివృద్ధి చేస్తామని పాలకులు, అధికారులు ఏళ్ల తరబడి చెబుతూనే ఉన్నారు. కానీ, దీనిని జాతీయ రహదారిగా మార్చకుండా నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారు. ఈ రహదారిని అభివృద్ధి చేసేందుకు సాంకేతిక కారణాలు చూపి అలానే ఉంచేశారు. దీంతో పదేళ్లుగా ఎలాంటి మరమ్మతులకు నోచుకోలేదు. ఈ రహదారి కూచిపూడి, మొవ్వ గ్రామాల మీదుగా చల్లపల్లి వెళ్తుంది. గుంతలమయంగా మారడంతో పలు గ్రామాల ప్రజలు పడుతున్న అవస్థలు అన్నీ ఇన్నీ కావు.

ఆంధ్రజ్యోతి విజిట్



చల్లపల్లి మండలం మేకావారిపాలెం వద్ద అప్రోచ్ దెబ్బతిని ప్రమాదకరంగా రహదారి

- గుడివాడ-కంకిపాడు రహదారి 28.4 కిలోమీటర్లమేర ఉంది. ఈ రహదారిని అభివృద్ధి చేయకుండా అలాగే వదిలేశారు. పెదపారుపూడి నుంచి వెంట్రప్రగడ వరకు 5 కిలోమీటర్ల మేర రహదారి పనులను నిలిపివేశారు. కనీస మరమ్మతులు కూడా చేయట్లేదు. దీంతో పెద్ద గోతులు ఏర్పడటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మిగతా 6లో..

- జిల్లాలోని తొమ్మిది రాష్ట్ర, జిల్లా రహదారులను పూర్తిస్థాయిలో గుంతలు లేకుండా చేసేందుకు గతనెలలో ప్రభుత్వం రూ.40.70 కోట్లు విడుదల చేసింది. టెండర్ల ప్రక్రియను పూర్తిచేసి పనులు త్వరగా చేపట్టాలని ఆయా ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.



సర్పం.. స్ఫటికం.. కుబుసం..

నమో నాగేశ్వరం

కృత్తివెన్ను నాగేశ్వరస్వామి ఆలయం ఓ అద్భుతం


- పాములా కుబుసం వదిలే ప్రత్యేక లింగం
- ఒక నెలలో మూడు వర్ణాలతో దర్శనం
- భారీగా తరలివచ్చి దర్శించుకుంటున్న భక్తులు

పాము విడిచిన కుబుసంలా పొలుసులు ఊడే శివలింగాన్ని మీరెప్పుడైనా చూశారా? వినడానికే కాదు.. చూడటానికి అద్భుతంలా అనిపించే ఈ మహా త్రివర్ణ భూ ఉద్భవ మహాలింగం మన జిల్లాలోనే ఉంది. కృత్తివెన్నులోని దుర్గా పార్వతీ సమేత నాగేశ్వరస్వామి ఆలయం ప్రత్యేకత ఇది. స్ఫటికాకార లింగంలో ఉండే స్వామి పౌర్ణమి రోజుల్లో తెల్లగా, అమావాస్యలో నల్లగా, మధ్యస్థ రోజుల్లో గోధుమ వర్ణంలో భక్తులకు దర్శనమిస్తారు. అంతేకాదు.. పాము కుబుసంలా పొలుసులు కూడా ఊడే ఈ మహాలింగానికి ప్రత్యేక చరిత్ర ఉంది. ఆ వివరాలు 6లో..

సాహో.. పారిశ్రామిక

జిల్లాలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఆహ్వానం

- ఎన్నారైలు సహా స్థానిక పారిశ్రామికవేత్తలకు..
- జనవరిలో బిజినెస్ మీట్ ఏర్పాటుకు సన్నాహాలు
- జిల్లాలోని వనరులు, అవకాశాలపై అవగాహన
- యువతకు ఉపాధి కల్పనే లక్ష్యంగా యూనిట్ల ఏర్పాటు
- పారిశ్రామికవేత్తలుగా కూడా తీర్చిదిద్దేందుకు చర్యలు



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : జిల్లాలో పరిశ్రమలు, వ్యాపారాల ఏర్పాటు, తద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు వీలుగా త్వరలో బిజినెస్ మీట్ నిర్వహించనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విశాఖలో నిర్వహించిన పెట్టుబడుల సదస్సును దృష్టిలో ఉంచుకుని జిల్లాస్థాయిలో కూడా ఆ తరహాలో మీట్ జరగాలని ఏర్పాట్లు చేస్తున్నారు. ఇది కొత్త సంవత్సరంలో ఈ మీట్ జరిగే అవకాశం ఉంది.

ఎన్ఆర్ఐలతో సంప్రదింపులు

ఉమ్మడి కృష్ణాజిల్లా అంటేనే ఎన్ఆర్ఐలకు పెట్టింది పేరు. ఇక్కడివారు చాలామంది పలు దేశాల్లో వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. అలాంటి వారిని సంప్రదించి మాతృభూమిలో కూడా పదిమందికి ఉపాధి కల్పించేలా వ్యాపారాలు, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పారిశ్రామిక యూనిట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాల్సిందిగా జిల్లా యంత్రాంగం అభ్యర్థించనుంది. తానా, ఆటా, నాట్స్ వంటి ప్రవాస భారతీయుల సంఘాల పెద్దలతో సంప్రదింపులు జరిపి బిజినెస్ మీట్‌కు ఆహ్వానించాలని చూస్తోంది. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో పేరొందిన పారిశ్రామికవేత్తలను ఆహ్వానించి పారిశ్రామిక యూనిట్లు ఏర్పాటుచేసేలా ఒప్పించాలని యోచిస్తోంది. మిగతా 6లో..

ఎంత కష్టం


జిల్లాలో ధాన్యం కొనుగోలు గందరగోళంగా మారింది. తుఫాను హెచ్చరిక నేపథ్యంలో కోతలు త్వరగా పూర్తిచేసి ధాన్యం విక్రయించేందుకు రైతులు మొగ్గు చూపుతుండగా, ఇప్పటికే సామర్థ్యానికి మించి ధాన్యం కొన్నామని, ఇప్పటికిప్పుడు ధాన్యం కొనే పరిస్థితి లేదని మిల్లర్లు చెబుతున్నారు. మరోవైపు సంచులు, వాహనాలు అందుబాటులో లేవని రైతుసేవా కేంద్రాల సిబ్బంది చెబుతుండటంతో రైతులు ఏం చేయాలో పాలుపోక తలలు పట్టుకుంటున్నారు.

వర్షం హెచ్చరికలతో అన్నదాతల్లో ఆందోళన

వరికోతలు ముమ్మరం చేసిన రైతులు ● ధాన్యం కొనుగోలులో గందరగోళంతో అవస్థలు

- సామర్థ్యానికి మించి కొనలేమంటున్న మిల్లర్లు
- నాణ్యత లేదని ధర తగ్గించి అడుగుతున్న దైన్యం
- తేమశాతాన్ని ఎక్కువగా చూపి దళారుల దగా
- ఇతర జిల్లాలకు విక్రయించకుండా అడ్డు
- తలలు పట్టుకుంటున్న రైతులు





యంత్రాల ద్వారా వరి కోతలు (ఇన్‌సెట్‌లో) ఉయ్యూరులో కొనుగోలుకు సిద్ధంగా ధాన్యం బస్తాలు

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : ఈత, కంకులు పాలుపోసుకునే దశలో ఉన్న వరిపై అక్టోబరు చివర్లో సంభవించిన మొంథా తుఫాను ప్రభావం భారీగానే పడింది. ఈ కారణంగా ధాన్యంలో కొంతమేర నాణ్యత తగ్గింది. బలమైన గాలుల ప్రభావంతో పాటు వర్షం కూడా కురవడంతో నూక శాతం పెరిగింది. దీంతో ధాన్యానికి పూర్తిస్థాయి మద్దతు ధర ఇచ్చేందుకు మిల్లర్లు ఆలోచిస్తున్నారు. సాధారణ రకం ధాన్యం తేమశాతం 17 పాయింట్లు ఉంటే, 75 కిలోల బస్తాకు రూ.1,776.75, గ్రేడ్-ఏ రకానికి రూ.1,791.75 మద్దతు ధరగా చెల్లించాలి. తుఫాను హెచ్చరికల నేపథ్యంలో యంత్రాల ద్వారా వరికోతలు పూర్తి చేస్తుండటంతో తేమశాతం 22 పాయింట్లపైనే ఉంటోంది. దీంతో బస్తా ధాన్యం రూ.1,540కే విక్రయిస్తున్నారు.

దళారుల దందా

వరికోతలు ప్రారంభం కావడంతో రైతులు మిల్లుల వద్దకు వెళ్తే.. ధాన్యంలో తేమశాతం అధికంగా ఉండటంతో పాటు ఇతరత్రా తప్పతాలు, పరిపక్వత కాని గింజలు, మట్టిశాతం కూడా అధికంగా ఉందని, బస్తాకు రూ.1,400 నుంచి రూ.1,440కు మించి ధర ఇవ్వలేమని మిల్లర్లు తెగేసి చెబుతున్నారు. ధాన్యంలో మానుగాయ కూడా అధికంగా ఉందని, ఈ కారణంగా బియ్యం దిగుమతి తగ్గుతుందని, ఈ నేపథ్యంలో పూర్తిస్థాయి మద్దతు ధర ఇవ్వలేమని రైతులకు మిల్లర్లు చెబుతున్నారు. ఇదిలా ఉంటే.. తుఫాను కారణంగా వర్షం కురుస్తుందనే కారణం చూపి మిల్లర్లకు, రైతులకు మధ్యవర్తులుగా దళారులు రంగంలోకి దిగుతున్నారు. ధాన్యం కొనుగోలు సక్రమంగా జరగడం లేదని ప్రచారం చేస్తూ రైతులను అయోమయానికి గురిచేస్తున్నారు. రైతులను తమదారిలోకి తెచ్చుకుని, తాము సూచించిన ధరకే ధాన్యం విక్రయించేలా మానసికంగా సిద్ధం చేస్తున్నారు. దీంతో లారీలో మిల్లుకు తీసుకెళ్లిన ధాన్యం తిరిగి వేరే మిల్లుకు తరలించలేక, లారీ కిరాయి, వెయిటింగ్ చార్జీలు పెట్టుకోలేక రైతులు.. మిల్లర్లు, దళారులు సూచించిన ధరకు విక్రయిస్తున్నారు.

ఇతర జిల్లాలకు విక్రయించకుండా ఆంక్షలు

జిల్లాలో 165 రైస్‌మిల్లులు ఉన్నాయి. వీటిలో డ్రయ్యర్ సౌకర్యం ఉన్న మిల్లులు 75 వరకు ఉన్నాయి. వరికోతలు ఒకేసారి ఊపందుకోవడంతో డ్రయ్యర్ సౌకర్యం ఉన్న మిల్లులకు పూర్తిస్థాయిలో ధాన్యం చేరింది. మరికొంత ధాన్యాన్ని రైతులు రహదారులపై, డొంకరోడ్లపై ఉంచి ఆరబెడుతున్నారు. డ్రయ్యర్ సౌకర్యం ఉన్న మిల్లుల్లో సామర్థ్యానికి మించి ధాన్యం మిగతా 6లో..

రెండు రోజులు వర్షాలు

వాతావరణంలో మార్పులు చోటు చేసుకుని కోస్తాతీరం వెంబడి పలు ప్రాంతాల్లో ఈనెల 23, 24 తేదీల్లో వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ శనివారం హెచ్చరించింది. ఈ నేపథ్యంలో వరికోతలు వాయిదా వేయాలని అధికారులు రైతులకు సూచిస్తున్నారు.

ఆ మూడు మండలాలు

ఎన్టీఆర్‌లో కలపండి

శాసనసభ కమిటీకి ఎమ్మెల్యే యార్లగడ్డ వినతి



విజయవాడ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : గన్నవరం నియోజకవర్గంలోని గన్నవరం, బాపులపాడు, ఉంగుటూరు మండలాలను ఎన్టీఆర్ జిల్లాలో విలీనం చేయాలని ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. జిల్లాల పునర్విభజనపై తుది నిర్ణయం చెప్పాలని మంత్రుల కమిటీ ఎమ్మెల్యే వెంకట్రావును కోరింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యార్లగడ్డ శనివారం గన్నవరంలో మీడియాతో మాట్లాడారు. గన్నవరం నియోజకవర్గంలోని విజయవాడ రూరల్ మండలం ఎన్టీఆర్ జిల్లాలోనే ఉందని, మిగిలిన మూడు మండలాలను ఎన్టీఆర్ జిల్లాలో విలీనం చేయాలని తాను ఇప్పటికే ప్రతిపాదనలు పంపినట్టు కమిటీకి తెలిపానన్నారు. నియోజకవర్గం రెండు జిల్లాల పరిధిలో ఉండటంతో పాలనాపరమైన సమస్యలు వస్తున్నాయన్నారు. భౌగోళికంగా గన్నవరం, బాపులపాడు, ఉంగుటూరు మండలాలు జిల్లా కేంద్రమైన మచిలీపట్నానికి దూరంగా, విజయవాడకు దగ్గరగా ఉన్నాయని, ప్రజల రాకపోకలకు విజయవాడే అనుకూలంగా ఉంటుందన్నారు. అంతేకాకుండా విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం ఇక్కడే ఉండటంతో గన్నవరంతో పాటు మిగిలిన రెండు మండలాలనూ ఎన్టీఆర్ జిల్లాలో విలీనం చేయాల్సిందనని మిగతా 6లో..

కూతురే కొడుకై.. తండ్రి చితికి నిప్పు

● విదేశాల నుంచి వచ్చిన కుమార్తె


ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సంచుల కొరత

స్వచ్ఛాంధ్రలో తప్పనిసరిగా పాల్గొనాలి

● సైకిల్‌పై వచ్చిన కలెక్టర్ బాలాజీ

6

నామినేషన్ నజరానా



గుణదల-గంగూరు విద్యుత్ కండక్టర్ల మార్పిడి పనుల్లో మతలబు

నామినేషన్ల విధానంలో కట్టబెట్టేందుకు ట్రాన్స్‌కో అత్యుత్సాహం

- నిబంధనలకు విరుద్ధంగా లేబర్ కాస్ట్ ఎక్కువగా చూపించి..
- ఇప్పటికే పలు తప్పుల కారణంగా ఒకసారి టెండర్ రద్దు
- మళ్లీ తప్పులు.. మరోసారి హడావిడిగా పిలుస్తున్న టెండర్లు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : గుణదల-గంగూరు 132 కేవీ ట్రాన్స్‌మిషన్ లైన్ కొత్త కండక్టర్ల ఏర్పాటును నిబంధనలకు విరుద్ధంగా నామినేషన్ విధానంలో చేయించేందుకు ట్రాన్స్‌కో అధికారులు తెర వెనుక ప్రయత్నాలు చేస్తున్నారు. రూ.5 లక్షలకు మించి నామినేషన్ విధానంలో పనులు చేయించటానికి నిబంధనలు ఒప్పుకోవు. అలాంటిది మెటీరియల్ డిపార్ట్‌మెంట్ ఇచ్చి, లేబర్ ఖర్చు, ఇతర కాంపోనెంట్స్‌తో కలిపి రూ.60 లక్షల వ్యయం అయ్యే పనులను నామినేషన్ విధానంలో అప్పగించటం వెనుక ఏదో మతలబు మిగతా 6లో..





సర్పం.. స్ఫటికం.. కుబుసం..

నమో నాగేశ్వరం

సాగరతీరంలో త్రివర్ణ భూ ఉద్భవ మహాలింగం ● కృత్తివెన్నులో శ్రీదుర్గాపార్వతీ సమేత నాగేశ్వరస్వామి ఆలయ విశిష్టత

- అమావాస్య, పౌర్ణమి నాడు కుబుసం విడుస్తున్న శివలింగం
- ఒకే నెలలో మూడు వర్ణాలు సాక్షాత్కారం
- పంచర్లింగాల్లో ఒకటి, రాష్ట్ర వ్యాప్తంగా తరలివస్తున్న భక్తులు

సాగరతీరంలో త్రివర్ణ భూ ఉద్భవ మహాలింగాన్ని చూశారా! పాము స్వభావం కలిగిన ఈ శివలింగం అమావాస్య, పౌర్ణమి రోజుల్లో పాము విడిచిన కుబుసంలా పొలుసులు ఊడుతుంది. నెలలో మూడు వర్ణాల్లో కనిపిస్తూ అనతి కాలంలోనే విశేష ప్రజాదరణను చూరగొంది. రాష్ట్రవ్యాప్తంగా భక్తులు తరలివస్తున్నారు. కార్తీక మాసంలో నిత్య పూజలు వైభవోపేతంగా జరిగాయి. కృష్ణాజిల్లా కృత్తివెన్నులో స్వయంభువుగా వెలసిన శ్రీ దుర్గా పార్వతీ సమేత నాగేశ్వర స్వామి ఆలయం ప్రత్యేకతలివి. ఎంతో చరిత్ర కలిగి పంచర్లింగాల్లో ఒకటిగా భాసిల్లుతున్న ఈ ఆలయం గురించి తెలుసుకుందాం.

- ఆంధ్రజ్యోతి, కృత్తివెన్ను

స్వయంభు లింగాలైన కృత్తివెన్ను నాగేశ్వరస్వామి, చినపాండ్రాక మార్కండేశ్వర స్వామి, ములపర్రు నాగేశ్వరస్వామి, తుమ్మిడి అగస్తేశ్వరస్వామి, కలిదిండి పాతాళభోగేశ్వరస్వామి ఆలయాలను పంచర్లింగాలుగా పేర్కొంటారు. పంచర్లింగాల్లో ఒకటైన శ్రీ దుర్గాపార్వతీ సమేత నాగేశ్వరస్వామికి ప్రత్యేక విశిష్టత ఉంది. స్వామి కోరిక మేరకు ఈ ఆలయం పశ్చిమ సింహద్వారం కలిగి ఉంటుంది. స్మశాన వాటికకు దగ్గరగా ఉండే ఈ ఆలయంలో స్ఫటికాకార లింగంలో ఉండే స్వామి పౌర్ణమి రోజుల్లో తెల్లగాను, అమావాస్యలో నల్లగాను, మధ్యస్థ రోజుల్లో గోధుమ వర్ణంలోనూ భక్తులకు దర్శనమిస్తారు. నెలలో మూడు వర్ణాలుగా కనిపించడం, అమావాస్య, పౌర్ణమికి శివలింగం నుంచి పాముకుబుసం మాదిరిగా పొలుసులు రాలడం ఈ ఆలయంలో విశేషం. అంతేకాక శివలింగం వెనుక భాగంలోని చిన్న గొయ్యి నుంచి నిత్యం జలం ఊరుతుంది. స్వామి దర్శనానికి వచ్చే భక్తులకు ఇందులోని జలాన్నే తీర్థంగా ఇస్తుంటారు.

ఆలయ చరిత్ర



రెడ్డిరాజుల కాలంలో ఈ ప్రదేశంలోని ఓ జమ్ముగుంటలో రెండు పశువులు పోట్లాడుకుంటుండగా పశువుల కాలిగిట్ట చెరువులో ఉన్న శివలింగానికి తగలటం, అంతలోనే చెరువులోని నీరంతా ఎరుపు రంగులోకి మారిందని పురాణం చెబుతోంది. నాటి పశువుల కాలిగిట్ట తాకిన స్థానంలో ఏర్పడ్డ చిన్నపాటి గొయ్యి (నుయ్యి) నేటికీ శివలింగంపై ఉంటుందని, వాటిలో ఊరే జలాన్నే భక్తులకు తీర్థంగా ఇస్తున్నట్లు అర్చకుడు కోట మురళీకృష్ణ చెప్తున్నారు. స్వామి రెడ్డిరాజుల కలలో దర్శనమిచ్చి, తనకు ఆలయం నిర్మించాలని కోరగా, రెడ్డిరాజులు ఆలయ నిర్మాణం చేశారని చెప్తున్నారు. నాడు నిర్మించిన ఆలయం శిథిలమైపోగా అనంతరం కాలంలో ఓ పనిమీద కృత్తివెన్ను వచ్చిన కాశీనాధుని నాగేశ్వరరావు పంతులుకు గ్రామస్థులు ఈ ఆలయం గురించి వివరించి పునఃనిర్మాణం చేయమని కోరటంతో సుమారు 150 ఏళ్ల కిందట ఆలయాన్ని రాతి కట్టడాలతో పునఃనిర్మించారు. తన కంపెనీ అమృతాంజన్ లాభాల్లో పైసా వాటా స్వామి పేరున రాసిచ్చారు. ఆ వాటాగా నేటికీ అమృతాంజన్ లాభాల్లో పైసా వాటా స్వామి ఖాతాకు జమౌతున్నట్లు ఈవో శింగనపల్లి శ్రీనివాసరావు చెప్పారు.

కార్తీక మాసంలో నిత్యపూజలు



ఆలయంలో శివరాత్రి ఉత్సవాలతో పాటు, కార్తీక మాసం నెల రోజులు, దసరా 10 రోజులు ప్రత్యేక పూజలు, అభిషేకలు, నిత్య పూజలు వైభవంగా జరుగుతాయి. నిత్యం పూజలందుకునే స్వామి దర్శనానికి భక్తులు అధిక సంఖ్యలో వస్తుంటారు. మూడు రోజుల పాటు జరిగే శివరాత్రి ఉత్సవాల్లో తొలిరోజు రాత్రి శివకేశవుల కల్యాణం ఒకే వేదికపై జరుగుతాయి. రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా శివకేశవుల కల్యాణం ఒకేచోట జరగటం కూడ ఇక్కడ విశిష్టతగా చెప్తుంటారు. 2వ రోజు రాత్రి కోనేటిలో పుష్పాలతో ప్రత్యేకంగా తయారు చేసిన హంస వాహనంపై స్వామి తెప్పోత్సవం, 3వ రోజు సాయంత్రం ఆలయ రథంపై రథోత్సవం ఘనంగా జరుగుతుంది. భక్తులు వేలాదిగా పాల్గొంటారు. భక్తుల కోసం స్థానిక అన్నదాన కమిటీ మూడు రోజుల పాటు నిత్యాన్నసమారాధన నిర్వహిస్తారు. కార్తీక మాసంలో ప్రతి సోమవారం వేలాదిగా భక్తులు స్వామిని దర్శించుకుంటారు. లక్ష రుద్రార్చన, లక్ష పత్రి పూజ, రుద్రాభిషేకం, జ్యోతిర్లింగార్చన వంటి విశేష పూజలతో పాటు కార్తీక వనసమారాధన నిర్వహిస్తారు. దసరా 10 రోజుల పాటు అమ్మవారు వివిధ అలంకరణలల్లో భక్తులకు దర్శనమిస్తారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరుపుతారు.

కూతురే కొడుకై తండ్రి చితికి నిప్పు

● విదేశాల నుంచి వచ్చి తండ్రికి తలకొరివిపెట్టిన కుమార్తె



తండ్రి భౌతికకాయం ఎదుట నిప్పుకుండ తీసుకువెళుతున్న కుమార్తె

చల్లపల్లి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కన్నవాళ్లు మరణిస్తే విదేశాల నుంచి రాలేమంటూ ముఖం చాటేస్తున్న పిల్లలున్న నేటి సమాజంలో మహిళ అయి ఉండీ విదేశాల నుంచీ వచ్చి అంతిమ సంస్కారాలు తానేచేసి కన్నతండ్రి రుణం తీర్చుకున్న వైనమిది. చల్లపల్లి మండలం నడకుదురు పంచాయతీ పరిధిలోని నాదెళ్లవారి పాలెం గ్రామానికి చెందిన రైతు నాదెళ్ల వెంకట రమణ (63) ఈనెల 19న కన్నుమూశారు. ఆయనకు భార్య హిమమాధురి, కుమార్తె ప్రత్యూష ఉన్నారు. కుమారులు లేకపోవటం, కుమార్తె ఒక్కరే సంతానం కావటం తో ఆమె రాక కోసం బంధువులు ఎదురుచూశారు. తండ్రిని కడసారి చూసేందుకు యుఎస్‌లో ఉద్యోగం చేస్తున్న నాదెళ్ల ప్రత్యూష శుక్రవారం రాత్రి స్వగ్రామమైన నాదెళ్లవారిపాలెం వచ్చారు. శనివారం ఉదయం అంతిమసంస్కారాలకు ఏర్పాట్లు చేయగా, కన్నతండ్రి రుణం తీర్చుకునేందుకు తానే కొడుకుగా మారి అంత్యక్రియలు నిర్వహించింది. కుమార్తె అయినా తక్కువ కాదంటూ చితికినిప్పుపెట్టే కుండను చేతబట్టుకుని శ్మశానవాటికకు వెళ్లి తండ్రికి తలకొరివిపెట్టింది. అంతేకాక పూజా కార్యక్రమాలు సైతం తానే నిర్వహించి బంధుమిత్రులు, గ్రామస్థుల మన్ననలు అందుకుంది. ప్రత్యూషతోపాటు బంధువులైన పలువురు మహిళలు సైతం అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

ప్రేమ పేరుతో మోసం.. ఒకరిపై కేసు నమోదు

గుడివాడ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక కార్మికనగర్‌కు చెందిన గొడవర్తి వేణుగోపాల్ ప్రేమ పేరుతో మోసం చేశాడని బాధితురాలు ఊర రమ్యశ్రీ టూటౌన్ పోలీసులను ఆశ్రయించింది. స్థానిక రైలుపేటకు చెందిన హైదరాబాద్, విప్రో సంస్థలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న ఊర రమ్యశ్రీ, స్థానిక కార్మికనగర్‌కు చెందిన గొడవర్తి వేణుగోపాల్ ప్రేమించుకున్నారు. అనంతరం కాలంలో పెళ్లి చేసుకోమని పలుమార్లు రమ్యశ్రీ వేణుగోపాల్‌ను అడిగినా అదిగో ఇదిగో అంటూ దాటవేస్తున్నాడు. ఈనెల మొదట్లో వేరొకరితో వేణుగోపాల్‌కు నిశ్చితార్థం జరగ్గా మోసపోయానని గ్రహించిన రమ్యశ్రీ టూటౌన్ పోలీసులను ఆశ్రయించింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు టూటౌన్ సీఐ జేఆర్‌కే హనీష్ తెలిపారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో

సంచుల కొరత



కూచిపూడిలో రోడ్లపై ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతులు



కారకంపాడులో ధాన్యాన్ని బస్తాల్లో నింపి లారీల కోసం ఎదురుచూస్తున్న రైతులు

కూచిపూడి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): వరి నూర్పిళ్లు ముమ్మరంగా ప్రారంభమయ్యాయి. యంత్రాల సాయంతో రైతులు కోతలు కోసి ధాన్యం ఆరబెట్టారు. కొనుగోళ్లు లేకపోవటంతో గ్రామాల్లో ధాన్యం నిల్వలు పేరుకుపోయాయి. రైతు సేవా కేంద్రాల్లో సంచుల కొరత ఏర్పడింది. మండలంలో 16 రైతు సేవా కేంద్రాలుండగా, కేవలం 30వేల సంచులే అందుబాటులో ఉన్నాయి. లక్షా 5 వేల సంచులు అవసరంగా అధికారులు ఇండెంట్ పెట్టి ఉన్నారు. నిడుమోలు కేంద్రంలో శుక్రవారం నాటికి ఒక్క గోనె సంచి లేదు. అవిరిపూడి, కూచిపూడి, అయ్యంకి, పెదముత్తేవి, వేములమడ కేంద్రాల్లో 1000 చొప్పున మాత్రమే ఉన్నాయి. కాటా వేసిన ధాన్యం వెంటనే మిల్లులకు తరలించాలి. లారీలు సకాలంలో రాకపోవటంతో మరింత ఇబ్బందికరంగా మారింది. ప్రభుత్వం తేమ శాతం 17గా నిర్ణయించగా, ప్రస్తుతం నూరుస్తున్న ధాన్యానికి 24 నుంచి ఆ పైనే తేమశాతం ఉండటంతో రైతులు తమ ధాన్యాన్ని ఆరు బయట ఆరబెట్టుకుంటున్నారు. రైతు సేవా కేంద్రాల్లో సిబ్బంది నుంచి ఆశించిన స్థాయిలో రైతులకు సేవలందకపోవటం రైతులను అయోమయానికి గురిచేస్తోంది. వారు దళారులను ఆశ్రయించి తక్కువ ధరలకే ధాన్యాన్ని అమ్ముకోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. రెండు రోజుల క్రితం భట్లపెనుమర్రు గ్రామానికి చెందిన రైతు చలసాని వెంకటేశ్వరరావు ధాన్యం అమ్మకాల్లో తాను పడుతున్న ఇబ్బందులపై మంత్రి నాదెండ్ల మనోహర్ దృష్టికి తీసుకెళ్లటంతో ఆగమేఘాలపై అధికారులు స్పందించి రైతు ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు చేశారు. దీన్ని బట్టి పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు, అధికారులు సంచులు, లారీల కొరత లేకుండా చూడటంతోపాటు రైతు సేవా కేంద్రాల్లో త్వరితగతిన సేవలందించేలా చర్యలు చేపట్టినట్లైతే ఈ సమస్యలు అధిగమించటానికి ఆస్కారం ఏర్పడుతుంది.

దళారులదే రాజ్యం

రైతు భరోసా కేంద్రాల్లో ఆంక్షల నేపథ్యంలో రైతులు మధ్య దళారులను ఆశ్రయిస్తున్నారు. దీంతో వారు ధరలు తగ్గించి ఇష్టారీతిన కొనుగోలు చేస్తూ అయినకాడికి దండుకుంటున్నారు. లారీలు, సంచుల కొరత, తేమ శాతం వంటి కారణాలతో రైతులు దళారులను ఆశ్రయించక తప్పటం లేదు.

రోజురోజుకూ పెరుగుతున్న ఫార్మసిస్టుల బాధ్యత

● డాక్టర్ సుమలత



సుమలతను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ లక్ష్మణరావు, అధ్యాపకులు

గుడ్లవల్లేరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): రోగికి సురక్షితమైన, సముచితమైన ఔషధ వినియోగం నిర్ధారించటంలో ఫార్మసిస్టు పాత్ర కీలకమని, ప్రజారోగ్యం, రోగికి కౌన్సెలింగ్, కమ్యూనిటీ సేవల్లో ఫార్మసిస్టు బాధ్యత రోజురోజుకూ పెరుగుతుందని రాజమండ్రి వికాస్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ ప్రిన్సిపల్ డాక్టర్ జీ సుమలత అన్నారు. శనివారం గుడ్లవల్లేరు వీవీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ కళాశాలలో వారం రోజులుగా ఇండియన్ ఫార్మాస్యూటికల్ అసోసియేషన్ గుడ్లవల్లేరు లోకల్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఫార్మశీ వారోత్సవాల ముగింపులో సుమలత ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. రాష్ట్ర జాతీయ స్థాయిలో ఇండియన్ ఫార్మాస్యూటికల్ అసోసియేషన్ (ఐపీఏ) వంటి సంస్థలు ఫార్మశీ విద్యార్థుల, ఫార్మసిస్టుల ప్రొఫెషనల్ డెవలప్మెంట్‌లో కీలకపాత్ర పోషిస్తున్నాయని డాక్టర్ సుమలత అన్నారు. వారం రోజులుగా నిర్వహిస్తున్న వివిధ పోటీల్లో విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ లక్ష్మణరావు, ఫార్మాస్యూటికల్ అసోసియేషన్ గుడ్లవల్లేరు లోకల్ శాఖ అధ్యక్షురాలు డాక్టర్ పీ రవీష, వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ కే పరిమళ, ఎస్‌కే నాగుల్ మీరా పాల్గొన్నారు.

ఆ మూడు మండలాలు ఎన్టీఆర్‌లో కలపండి

(5వ పేజీ తరువాయి)

పేర్కొన్నారు. ఇదే అంశంపై గన్నవరం, ఉంగుటూరు, బాపులపాడు మండలాల్లో ప్రత్యేక బృందంతో సర్వే చేయించి ప్రజల అభిప్రాయాలను సేకరించగా, మెజారిటీ వర్గం సానుకూలంగా ఓటు వేసిందరన్నారు. ఈ అంశంపై పునరాలోచనకు తావులేదని స్పష్టం చేశారు. కాగా, ఎన్టీఆర్ పుట్టిన నిమ్మకూరు కృష్ణాజిల్లాలో ఉన్నందున కృష్ణాజిల్లాను ఎన్టీఆర్ జిల్లాగా, ఎన్టీఆర్ జిల్లాను కృష్ణా జిల్లాగా పేర్లు మార్చాలని ఆయన శాసనసభ కమిటీకి సూచించారు.

సాహో.. పారిశ్రామిక

(5వ పేజీ తరువాయి)

పరిశ్రమలకు అనువైన ప్రాంతం

పశ్చిమ ఎన్టీఆర్ జిల్లా పారిశ్రామికంగా అభివృద్ధి చెందటానికి అవకాశం ఉంది. ఇప్పటికే ఇక్కడ సిమెంట్, స్టీల్, ఫార్మా కంపెనీలు పెద్దసంఖ్యలో ఉన్నాయి. సున్నపురాయి నిక్షేపాలతో పాటు అనేక మినరల్స్ అందుబాటులో ఉన్నాయి. మినరల్స్ ఆధారిత పరిశ్రమలకు జిల్లాలో ఎంతో అవకాశం ఉంది. అలాగే, పర్యాటకంగా అభివృద్ధి చెందే మంచి ప్రాంతాలున్నాయి. విజయవాడ నగరం సర్వీసు రంగానికి పేరొందింది. తయారీ, సేవల రంగాల్లో ఇక్కడ పెట్టుబడులు పెట్టొచ్చు.జిల్లాలో భౌగోళికంగా ఎక్కడెక్కడ పరిశ్రమలు ఏర్పాటు చేయవచ్చో తగిన సమాచారం ఇవ్వటానికి వీలుగా ప్రజెంటేషన్స్ తయారు చేయాలని కలెక్టర్ లక్ష్మీశ ఇప్పటికే సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అలాగే, స్థానికంగా ఉన్న ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను కూడా ప్రోత్సహించటానికి వీలుగా కూడా బిజినెస్ మీట్‌లో ఏర్పాట్లు చేయాలని చూస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం నియోజకవర్గానికో ఎంఎస్ఎంఈ పార్క్ ఏర్పాటు దిశగా యంత్రాంగం అడుగులు వేస్తోంది. వీటిపై స్థానిక ఔత్సాహికులకు మార్గదర్శకాలు సూచించనున్నారు.

ఎంత కష్టం

(5వ పేజీ తరువాయి)

ఉంటే రైతులు ఇబ్బందులు పడకుండా ఇతర జిల్లాలకు విక్రయించవచ్చు. ఆన్‌లైన్‌లో ఎంపిక చేసిన మిల్లులను ట్యాగ్ చేయొచ్చు. జిల్లాలో రబీ సీజన్‌లో వరిసాగుకు అవకాశం లేకపోవడంతో ఖరీఫ్‌లోని ధాన్యం కొనుగోలు ప్రక్రియను రానున్న మూడు నెలల పాటు కొనసాగించాలనే తలంపుతో మిల్లర్లు ఉన్నారు. ధాన్యాన్ని ఇతర జిల్లాలకు పంపితే స్థానికంగా ఉన్న మిల్లులకు పని ఉండదని... ఇతర జిల్లాలకు తరలించకుండా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ ద్వారా తీర్మానం చేసినట్లు సమాచారం. ఈ కారణంతో ఇతర జిల్లాల్లోని మిల్లులను ఆన్‌లైన్‌లో ట్యాగ్ చేయకుండా అధికారులు ఆలోచిస్తున్నారు. దీంతో జిల్లాలో ధాన్యం నిల్వలు పేరుకుపోతున్నాయి. గత ఏడాది ఉభయగోదావరి జిల్లాలతో పాటు ఎన్టీఆర్, గుంటూరు, తిరుపతి జిల్లాల్లోని మిల్లులకు ధాన్యాన్ని పంపారు. కోతల ప్రారంభంలో మండపేట, హైదరాబాద్‌కు చెందిన వ్యాపారులు జిల్లాకు వచ్చి ధాన్యం కొన్నారు. ఇతర జిల్లాల్లోనూ వరికోతలు ప్రారంభం కావడంతో అక్కడి వ్యాపారులు కొన్నిరోజులుగా కొనుగోలు తగ్గించారు. హైదరాబాద్ వ్యాపారులు బీపీటీ-5204 రకం ధాన్యాన్నే కొంటున్నారు. ముతకరకాల ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో జిల్లాలో కొనుగోళ్లు మందగించాయి. అధిక దిగుబడి వస్తుందని జిల్లాలో ఎంటీయూ-1318 రకం వంగడాన్ని అధికంగా సాగు చేశారు. తుఫాను ప్రభావంతో ఈ రకం ధాన్యంలో నూకశాతం పెరగడంతో పూర్తిస్థాయి మద్దతు ధర లభించట్లేదు. ధాన్యం మరపట్టిన అనంతరం ఎఫ్‌సీఐకు బియ్యం విక్రయించే సమయంలో నూకశాతం 10 శాతానికి మించకూడదనే నిబంధన విధించారు. తుఫాను పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని నూకశాతాన్ని 15 పాయింట్లకు పెంచాలనే డిమాండ్ రైతులు, మిల్లర్ల నుంచి వినిపిస్తోంది.

ప్రమాదానికి దారులు

(5వ పేజీ తరువాయి)

గుడివాడ-పోలుకొండ 12 కిలోమీటర్ల మేర రహదారి పూర్తిగా పాడైంది. అయినా బాగుచేయలేదు. నందివాడ నుంచి లక్ష్మీనరసింహపురం వరకు ఉన్న రహదారి పాడైనా పట్టించుకునేవారు లేరు.

- గన్నవరం-పుట్టగుంట రహదారి 8.800 కిలోమీటర్ల గుంతలమయంగా మారింది. ఈ రోడ్డును రూ.7 కోట్ల అంచనాలతో మరమ్మతులకు అనుమతులు వచ్చినా పనులు ఎప్పుడు చేస్తారో తెలియని పరిస్థితి నెలకొంది.
- పెడన నియోజకవర్గం నడుపూరు-వాడవల్లి కోరుకొల్లు రహదారి 4.800 కిలోమీటర్ల మేర దెబ్బతింది. ఈ రహదారిని ఎప్పటికి అభివృద్ధి చేస్తారో తెలియక స్థానికులు అవస్థలు పడుతున్నారు.
- కోసూరు వయా నిమ్మకూరు, అవిరిపూడి రహదారితో పాటు నిమ్మకూరు వయా పోలవరం, ఉండ్రపూడి, నిభానుపూడి రహదారి 8 కిలోమీటర్ల మేర గుంతలయమంగా మారాయి.
- నాగాయలంక-కోడూరు రహదారితో పాటు అవనిగడ్డ ఫ్లడ్‌బ్యాంకు నుంచి అశ్వారావుపాలెం వరకు, నాగాయలంక-నాలి రహదారులు ఇటీవల కురిసిన వర్షాలకు పూర్తిగా దెబ్బతిన్నాయి. రహదారులకు కనీస మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

నామినేషన్ నజరానా

(5వ పేజీ తరువాయి)

ఉందన్న ఆరోపణలు వస్తున్నాయి.

లేబర్ కాస్టుపై అభ్యంతరాలు

గుణదల-గంగూరు 132 కేవీ లైన్ కొత్త కండక్టర్ల ఏర్పాటుకు ఏప్రిల్‌లో ట్రాన్స్‌కో అధికారులు టెండర్లు పిలిచారు. మొత్తం 15 కిలోమీటర్ల మేర కొత్త కండక్టర్లతో పాటు లేబర్ కాస్ట్, ఇతర కాంపోనెంట్స్‌తో కలిపి రూ.2.77 కోట్లకు టెండర్ పిలిచారు. మెటీరియల్ కాస్ట్ విషయంలో సమస్య లేదు. కాంపోనెంట్స్‌లో లేబర్ ఖర్చుకు కిలోమీటరుకు నిర్దేశించిన రేటుపై అభ్యంతరాలు వచ్చాయి. ఎక్కడా లేని విధంగా కిలోమీటరు లేబర్ ఖర్చును రూ.2,52,089గా నిర్ణయించారు. నిబంధనల ప్రకారం దీనికి 108.615 శాతం భాగించాలి. ఈ 108.615లో లైవ్ చార్జీలు 75 శాతం, ఏరియా అలవెన్స్ 20 శాతం, కాంట్రాక్టర్ ప్రాఫిట్ 13.615 శాతం ఉంటాయి. ఈ మొత్తం కలిపితే కిలోమీటరుకు రూ.5,25,095 లేబర్ ఖర్చుగా నిర్ణయించారు. ఈ లెక్కన 15 కిలోమీటర్లకు రూ.78.76 లక్షలు లేబర్ ఖర్చు అవుతుందని టెండరులో పేర్కొన్నారు. తెలంగాణాలో కేవలం కిలోమీటరుకు రూ.64 వేలే లేబర్ ఖర్చుగా చూపిస్తారు. ఇంత భారీవ్యత్యాసం చూపించటంపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనాన్ని కూడా ప్రచురించింది. ఈ కథనం నేపథ్యంలో ట్రాన్స్‌కో ఆ టెండర్లను రద్దు చేసింది.

'ఆంధ్రజ్యోతి' కథనాలతో..

ఇటీవల గుణదల-గంగూరు హైటెన్షన్ మార్గం, ఆయుష్ ఆసుపత్రి సమీపంలో కండక్టర్లు ఊడిపడటం, బంప్ దగ్గర తీగలు వేలాడటం జరిగింది. దీనిపై 'ఆంధ్రజ్యోతి' కథనం ప్రచురించింది. టెండర్లు పిలిచి పనులు చేపట్టాల్సిన ట్రాన్స్‌కో అధికారులు 'ఆంధ్రజ్యోతి'లో కథనాలు వస్తున్నాయన్న పేరుతో నామినేషన్‌కు పనులు అప్పగించేందుకు సిద్ధం చేస్తున్నారు. ట్రాన్స్‌కో అధికారులను అప్రమత్తం చేయటానికి ఆ కథనం ప్రచురితం కాగా, నామినేషన్ విధానంలో టెండర్లు పిలవమని ఎక్కడా చెప్పలేదు. ప్రస్తుతం దీని వెనుక ఉన్న కిరికిరిపై చర్చ నడుస్తోంది.



అంతర్‌జిల్లా క్రికెట్ చాంప్ కృష్ణా

విజయవాడ(స్పోర్ట్స్), నవంబరు22(ఆంధ్రజ్యోతి) : అండర్-14 అంతర్ జిల్లా క్రికెట్ చాంపియన్‌గా కృష్ణా జట్టు నిలిచింది. గుంటూరు జిల్లా పిచికులగుట్టలో జరిగిన ఏసీఏ సెంటర్ జోన్ ఇంటర్ డిస్ట్రిక్ ఫైనల్ లీగ్ లో కృష్ణా, వెస్ట్ గోదావరి జట్లు తలపడగా టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన కృష్ణా జట్టు 90 ఓవర్లలో 505 పరుగులు చేసి డిక్లేర్ చేసింది. జట్టులో కె.తమన్ సాయి 139 పరుగులు, డి.భానుచంద్ మాదవ్ 123 పరుగులు, జి.సాయి సహర్ష 115 పరుగులతో సెంచరీలు సాధించగా, బౌలర్ టి.దోని నాలుగు వికెట్లు తీసి జట్టు విజయంలో కీలకపాత్ర వహించారు. అనంతరం బ్యాటింగ్ చేసిన వెస్ గోదావరి జట్టు 10 వికెట్లు కోల్పోయి 175 పరుగులు మాత్రమే చేసి ఓటమి చెందింది. కృష్ణా జట్టు చాంపియన్‌గా నిలవగా, గుంటూరు జట్టు రెండవ స్థానంలో నిలిచింది.

స్వచ్ఛాంధ్రలో తప్పనిసరిగా పాల్గొనాలి

● సైకిల్‌పై కార్యాలయానికి వచ్చిన కలెక్టర్ బాలాజీ

● మోటారు సైకిళ్లన్నీ కలెక్టరేట్ బయటే



స్వచ్ఛభారత్‌లో పాల్గొన్న కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం టౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర లో ప్రతి ఒక్కరూ పాల్గొని ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించాలని కలెక్టర్ బాలాజీ అన్నారు. స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్రలో భాగంగా శని వారం కలెక్టరేట్‌లో ఉద్యోగులతో కలిసి స్వయంగా పరిసరాలు శుభ్రం చేశారు. శబ్ద, వాయు కాలుష్యాన్ని నివారించేందుకు కలెక్టరేట్‌లోకి శనివారం మోటారు సైకిళ్లు, కార్లు రాకుండా కట్టడి చేశారు. కలెక్టర్ తన ఇంటి నుంచి సైకిల్‌పైనే వచ్చి సైకిల్‌పైనే వెళ్లారు. డీపీవో జె అరుణ, డీఆర్వో చంద్రశేఖర్, బీసీ సంక్షేమ శాఖాధికారి రమేష్, డీఈవో రామారావు, అధికారులు, సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.

ప్రాథమిక వైద్యానికే ప్రాధాన్యం: నండూరి



పామర్రు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు ప్రాథమిక వైద్యం తప్ప అధిక వైద్యం ఆర్ఎంపీలు చేయకూడదని రాష్ట్ర ఆర్ఎంపీ వైద్యసంఘం అధ్యక్షుడు నండూరి ఉమాశంకర్ అన్నారు. స్థానిక చల్లపల్లి రోడ్డులోని ఓ ఆర్ఎంపీ వైద్యశాలలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆర్ఎంపీ వైద్యసంఘం పామర్రు నియోజకవర్గానికి నూతన అధ్యక్షుడిగా పోలన అశోక్‌కుమార్, కార్యదర్శిగా మోపిదేవి శివశంకర్, కోశాధికారిగా మైనీడు వెంకటేశ్వరరావు, సభ్యులుగా ఎంపికైన బీ సుబ్రమణ్యం, దారం వెంకటేశ్వరరావు, పాషాజానీ, కే పద్మ, మంతెన ఇంద్రాణిని అభినందించారు. సంఘ రాష్ట్ర కార్యదర్శి డీవీ నాగేశ్వరరావు, ప్రచార కమిటీ రాష్ట్ర చైర్మన్ వీ శ్రీనివాసరావు, పరసా లక్ష్మణరావు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్‌బర్డ్	122, 131, 142
చికెన్ విత్ స్కిన్	232
చికెన్ స్కిన్‌లెస్	242

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 660

చట్టబద్ధమైన దత్తతే పిల్లలకు వరం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆర్థికభారం, నిరక్షరాస్యత కారణంగా అనేక మంది పిల్లలను అమ్ముతున్నారని, అక్రమ అమ్మకాలు అరికట్టి చట్టబద్ధంగా పిల్లలను దత్తత తీసుకోవడం చిన్నారులకు, తల్లిదండ్రులకు మంచిదని వీఆర్వో సునీల్‌కుమార్ సూచించారు. వీరవల్లి అంగన్‌వాడీ కేంద్రంలో నేషనల్ అడాప్షన్ డే సందర్భంగా మహిళ శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గర్భంలో పెంచిన బిడ్డను బ్రతకనిద్దాం- మానవతా విలువలు కాపాడుదాం అనే థీమ్ ద్వారా మహిళలకు అవగాహన కల్పించారు. ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల దత్తతను ప్రోత్సహించే విధంగా అవగాహన పెంపొందించేందుకు మిషన్ వాత్సల్య కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సుహాసిని, ఇందిరా కుమారి, హేమలత, రమాదేవి పాల్గొన్నారు.

ప్రమాదకరంగా..!

- కోతకు గురైన చంద్రయ్య డ్రెయినేజీపై వంతెన అప్రోచ్ రోడ్డు
- బిక్కు బిక్కుమంటూ వంతెనపై రాకపోకలు సాగిస్తున్న సాయిపురం, ముదునూరు గ్రామస్తులు

(ఉయ్యూరు- ఆంధ్రజ్యోతి)

సాయిపురం- ముదునూరు ఆర్‌అండ్‌బీ రోడ్డులో చంద్రయ్య డ్రెయినేజీపై వంతెన అప్రోచ్ రోడ్డు కోతకు గురై ప్రమాదభరితంగా ఉన్న పరిస్థితుల్లో ఆయా గ్రామాల ప్రజలు బిక్కు బిక్కుమంటూ వెళుతున్నారు. రోడ్డు అభివృద్ధి పనుల్లో భాగంగా గత సంవత్సరం వంతెనకు ఇరువైపుల కోతకు గురైన అప్రోచ్‌రోడ్డు వద్ద తూతూ మంత్రంగా ఇసుక బస్తాలు వేసి సపోర్టుగా బాదులు పాతారు. రోడ్డు వేసిన తరువాత కురిసిన వర్షాలకు కాల్వ పొంగి ఇరువైపులా అప్రోచ్ రోడ్డు కోతకు గురై కాల్వలో పడిపోయింది. దీంతో సగం రోడ్డు వరకు కోసుకు పోవడంతో ట్రాక్టర్లు, ఇతర పెద్దవాహనాలు బిక్కుబిక్కుమంటూ నడుపుతున్నారు. వ్యవసాయ పనులు ప్రారంభమై పొలాల నుంచి లారీలు, ట్రాక్టర్లు, ఎడ్ల బండ్లపై ధాన్యం రవాణా చేయవలసిన నేపథ్యంలో కోతకు గురైన రోడ్డు రైతులను భయాందోళన గురి చేస్తుంది. దీంతో పాటు వంతెన కూడా శిథిలావస్థకుచేరుకున్న పరిస్థితుల్లో వాహనాలు నడిపేవారు భయపడుతున్నారు.

నిధులు మంజూరు చేయాలి

అప్రోచ్ రోడ్డుకు రిటైనింగ్ వాల్ నిర్మించాల్సిన అవసరాన్ని పై అధికారులకు వివరించాం. ఇప్పటికే అంచనాలు తయారు చేశాం. నిధులు మంజూరు అయిన వెంటనే రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులు చేపడతాము.

- బలరామ్, ఆర్ అండ్ బీ డీఈ



సాయిపురం- ముదునూరు రోడ్డులో కోతకు గురై ప్రమాదకరంగా చంద్రయ్య డ్రెయినేజీపై వంతెన అప్రోచ్ రోడ్డు



నిరుపేదకు టిఫిన్ బండిని అందిస్తున్న బోడె వెంకట్రామ్.. ఉంగుటూరులో పీఆర్కే ఫౌండేషన్ అధినేత పారా రామకృష్ణ

యువనేత బోడె వెంకట్రామ్ సేవలు ఆదర్శనీయం

పెనమలూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ యువనేత బోడె వెంకట్రామ్ సేవలు యువత ఆదర్శంగా తీసుకొని సమాజంలో సేవా కార్యక్రమాలు చేయాలని టీడీపీ సీనియర్ నాయకులు అనుమోలు ప్రభాకరరావు, మారుపూడి ధనకోటేశ్వరరావు పిలుపునిచ్చారు. శనివారం పోరంకి టీడీపీ కార్యాలయంలో యువనేత బోడె వెంకట్రామ్ ఉయ్యూరుకు చెందిన నిరుపేద నిమ్మాది మరియమ్మ జీవనోపాధికి టిఫిన్ బండిని ఇచ్చిన సందర్భంగా వారు మాట్లాడారు. గత రెండేళ్లుగా బోడె వెంకట్రామ్ నియోజకవర్గంలో ఎవరికి ఏ కష్టం వచ్చినా చిన్నదని...పెద్దదని చూడకుండా నిరుపేదలకు సాయం చేస్తూ వారి జీవనానికి సహకరించడం అభినందనీయమన్నారు.భవిష్యత్తులో వెంకట్రామ్ మరిన్ని సేవా కార్యక్రమాలు చేసి మంచి గుర్తింపు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కోయ ఆనంద్‌ప్రసాద్, బొంగరాల అబ్రహం తదితరులు పాల్గొన్నారు.

ఉంగుటూరు : టీడీపీ పేద కార్యకర్తలకు చేయూతనందించడమే లక్ష్యంగా పీఆర్కే ఫౌండేషన్‌ను స్థాపించి, సీఎం చంద్రబాబు పీ4 స్ఫూర్తితో గన్నవరం నియోజకవర్గంలో సేవా కార్యక్రమాలను విస్తృతం చేస్తున్నట్లు పీఆర్కే ఫౌండేషన్ అధినేత, ఎన్నారై పారా రామకృష్ణ అన్నారు. ఉంగుటూరుకు చెందిన టీడీపీ పేద కార్యకర్త షేక్ మస్తాన్ వలి స్థానిక సెంటర్లో షెడ్డు అద్దెకు తీసుకుని కొన్నేళ్లుగా టిఫిన్ సెంటర్ నిర్వహిస్తూ ఆర్థికంగా నష్టపోయాడు. అతడి పరిస్థితిని రామకృష్ణ దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించిన ఆయన సుమారు రూ.30వేల వ్యయంతో టిఫిన్‌బండిని కొనుగోలుచేసి మస్తాన్‌వలీకి అందజేశారు. శనివారం రామకృష్ణతో కలిసి టిఫిన్‌బండిని టీడీపీ సీనియర్ నాయకుడు గుత్తా అనిల్‌బాబు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కాకుమాను సత్యనారాయణ, బొబ్బా వాసుదేవరావు, రాచకొండ శ్రీనివాసరావు, డి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతపై స్పెషల్ డ్రైవ్

ఉయ్యూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛత గ్రామాల పై స్వయం సహాయ సంఘాల సభ్యులకు అవగాహన సదస్సులు, స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో శేషగిరిరావు తెలిపారు. మండల కార్యాలయంలో శనివారం స్వయం సహాయ సంఘాల సభ్యులకు స్వచ్ఛత గ్రామాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్రపై ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాల సాధనకు గ్రామాల్లో గ్రీన్ అంబాసిడర్ల తో పాటు స్వయం సహాయ సంఘాల నుండి ఇద్దరు చొప్పున సీఆర్పీలుగా నియమించి గృహస్థులకు చెత్త విభజనపై అవగాహన కల్పిస్తున్నామన్నారు.



ఎంకే స్కూల్‌లో గ్రీన్ డే

ఉయ్యూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): శ్రీఎంకే ఇంగ్లీషు మీడియం హైస్కూల్‌లో శనివారం ఎల్‌పీపీ, యుపీపీ, ఫస్ట్ క్లాస్ చిన్నారులతో గ్రీన్‌కలర్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రీన్‌కలర్‌లో ఉండే కూరగాయలు, పండ్లు వాటి ఉపయోగాలపై చిన్నారులకు అవగాహన కల్పించారు. పచ్చని చెట్లు, వాటివలన ప్రయోజనాలు తెలియజేస్తూ ప్రదర్శించారు. చిన్నారులు పచ్చని దుస్తుల వేషధారణలో అలరించారు. రంగుల విశిష్టత తెలియజేయడంతో పాటు వాటికి సంబంధించిన విషయాలపై అవగాహనకు ఇటువంటి కార్యక్రమాలు నిర్వ హిస్తున్నట్టు స్కూల్ డైరెక్టర్ ఎంకే బాబు తెలిపారు.



అభయాంజనేయస్వామి క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్

అభయాంజనేయస్వామి క్యాలెండర్ ఆవిష్కరణ

హనుమాన్‌జంక్షన్‌రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : అభయాంజనేయస్వామి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖశాంతులతో వర్ధిల్లాలని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఆకాంక్షించారు. హనుమాన్‌జంక్షన్ శ్రీఅభయాంజనేయ స్వామి దేవస్థాన క్యాలెండర్‌ను శనివారం ఆయన ఆవిష్కరించారు. ప్రధాన అర్చకులు మారేపల్లి సీతారామాంజనేయచార్యులు స్వామి వారి శేషవస్త్రాన్ని, ప్రసాదాన్ని అందించి వేదాశీర్వాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన చైర్మన్ వేమూరి శ్రీనివాసరావు, కార్యనిర్వహణాధికారి పి. తారకేశ్వరరావు, ట్రస్ట్ బోర్డు సభ్యులు కమిలి లక్ష్మి, దన్నే అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఉయ్యూరులో ఎన్‌సీసీ క్యాడెట్ల ర్యాలీ

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

ఉయ్యూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని శ్రీవిశ్వశాంతి విద్యాసంస్థల చైర్మన్ మాదల సుబ్రమణ్యేశ్వరరావు అన్నారు. ఎన్‌సీసీ డే పురస్కరించుకుని 16వ ఆంధ్రా బెటాలియన్ (మచిలీపట్నం) ఎఎన్‌ఓ కెప్టెన్ వేమూరి ఎలిజిబెత్ రాణి ఆధ్వర్యంలో శ్రీవిశ్వశాంతి జూనియర్ కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్లు మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా నిర్వహించిన ర్యాలీని విద్యాసంస్థల ఆవరణలో శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మాదకద్రవ్యాలకు యువత అలవాటు పడకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు. మత్తుకు అలవాటు పడితే మానుకోవడం చాలాకష్టమన్నారు. జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కె.పద్మజ వాణి, శ్రీనివాస అక్షరాలయం కేర్ టేకర్ ఎ.సుశాంత్ తదితరులు పాల్గొన్నారు. విద్యాసంస్థల ఆవరణ నుంచి పట్టణ ప్రధాన సెంటర్ వరకు మాదక ద్రవ్యా లు వద్దే వద్దు, యువతా మేలుకో మత్తుకు దూరంగా ఉండాలని ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు.

రైతులకు అండగా ఏఎంసీలు



ఉయ్యూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : రైతులకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుందని ఏఎంసీ చైర్మన్ కొండా ప్రవీణ్ కుమార్ అన్నారు. టీడీపీ నాయకులు, పీఏసీఎస్ చైర్‌పర్సన్‌లతో కలసి శనివారం చినఓగిరాలలో పర్యటించి వరి కోత కోసి రాశులపై ఉన్న ధాన్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రైతులు కోతకోసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా మిల్లులకు రవాణా సమయం దాటితే ఆరబోసినప్పుడు వర్షాలు కురిస్తే తార్పాలిన్లు సొసైటీల ద్వారా అందు బాటులో ఉంచేందుకు చర్యలు చేపట్టామన్నారు. రైతులకు ఏఎంసీ ద్వారా అండగా ఉంటామన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు కుటుంబరావు, పీఏసీఎస్ చైర్‌పర్సన్ పాలడుగు రామకృష్ణ, డైరెక్టర్ దుర్గారావు, హరీశ్, మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.



పోరంకిలో జరిగిన పడిపూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే బోడె ప్రసాద్

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప పడిపూజ

పెనమలూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : పోరంకిలోని బృందావన్ కాలనీ వద్ద శనివారం రాత్రి జరిగిన అయ్యప్ప పడి పూజా కార్యక్రమం భక్తి శ్రద్ధల నడుమ నిర్వహించారు. మాన్యశ్రీ పూర్ణ గురుస్వామి ఆధ్వర్యంలో బొల్లు రవీంద్ర బాబు నేతృత్వంలో జరిగిన పడిపూజ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే బోడె ప్రసాద్, టీడీపీ సీనియర్ నాయకులు అనుమోలు ప్రభాకరరావు హాజరయ్యారు. స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. పడిపూజ అనంతరం అయ్యప్పలకు, భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు.



రైతులకు స్ప్రేయర్లు, సేఫ్టీకిట్లు అందజేస్తున్న యార్లగడ్డ సతీష్

తానా సహకారం అభినందనీయం

- ఉమామహేశ్వరపురంలో 110 మంది రైతులకు ఉపకరణాలు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): రైతు కుటుంబాలకు చెందిన ప్రవాసాంధ్రులు జన్మభూమిపై మక్కువతో తానా ఆధ్వర్యంలో ఉపకరణాలు అందజేయడం అభినందనీయమని టీడీపీ నేత యార్లగడ్డ సతీష్, ఏఎంసీ డైరెక్టర్ ఆర్నేపల్లి రామలక్ష్మి అన్నారు. ఉమామహేశ్వరపురంలో తానా ఆధ్వర్యంలో అధికార ప్రతినిధి కలపాల రాజాబాబు పర్యవేక్షణలో రైతులకు రూ.4లక్షల విలువైన ఉపకరణాలను శనివారం పంపిణీ చేశారు. 110 మంది రైతులకు అవసరమైన పవర్‌స్ప్రేయర్లతో పాటు ప్రాణాలు కాపాడే విధంగా సేఫ్టీకిట్లు అందజేయడం జరిగిందని తానా అధికార ప్రతినిధి కలపాల రాజాబాబు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ ఆర్నేపల్లి రామలక్ష్మి, పీఏసీఎస్ చైర్‌పర్సన్ కలపాల నాని, మాజీ సర్పంచ్ ఆర్నేపల్లి సూరిబాబు, వెంకటేశ్వరరావు, టీఎస్‌టీయూసీ నాయకుడు పాండురంగరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి మానవత సహకారం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : విద్యాభివృద్ధితో పాటు అవసరాల కనుగుణంగా సేవలందించడమే మానవత లక్ష్యమని రాష్ట్ర కన్వీనర్ మారుబోయిన కోటేశ్వరరావు అన్నారు. హనుమాన్‌జంక్షన్ మానవత కార్యాలయంలో శనివారం బీఎస్సీ నర్సింగ్ విద్యార్థికి ఆర్థికసాయం అందజేశారు. బాపులపాడుకు చెందిన ఎరికిపాటి అనురాధ బీఎస్సీ నర్సింగ్ మొదటి సంవత్సరం విద్యకు అవసరమైన రూ.10వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు బాణాల నరసింహారావు, గణేష్‌బాబు, సత్యనారాయణ, రామచంద్రరావు, సూర్యనారాయణ పాల్గొన్నారు.



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

క్రీడలతో అందరికీ ఆరోగ్యం

- భాష్యం బ్లూమ్స్ స్పోర్ట్స్ మీట్‌లో డాక్టర్ జి. సమరం

గుంటూరు(విద్య) / పెనమలూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆధునిక యుగంలో ఒత్తిడి అనేది ప్రతి ఒక్కరి జీవితంలో ముఖ్య పాత్ర పోషిస్తుందని, దీనిని అధిగమించడానికి శారీరక శ్రమ ఎంతో అవసరమని ఇందుకు క్రీడలు ఎంతగానో దోహదపడతాయని ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ జి. సమరం అన్నారు. పోరంకి భాష్యం బ్లూమ్స్ క్యాంపస్‌లో శనివారం జరిగిన ఇంటర్ హౌస్ స్పోర్ట్స్ మీట్ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ సమరం మాట్లాడుతూ, విద్యార్థులు ఒత్తిడిని జయించడానికి క్రీడలు ఎంతగానో ఉపకరిస్తాయన్నారు. క్రీడల వల్ల నాయకత్వ లక్షణాలు, క్రీడాస్ఫూర్తి పెంపొందుతాయన్నారు. విద్యార్థులు జంక్ ఫుడ్‌లకు దూరంగా ఉండాలని, దీనివల్ల చిన్న వయసులోనే బీపీ, మధుమేహం, ఊబకాయం వంటి దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడుతున్నారన్నారు. విచ్చలవిడిగా సామాజిక మాధ్యమాలు, మొబైల్ ఫోన్ల వాడకం ద్వారా కుటుంబ బాంధవ్యాలు విచ్ఛిన్నమవుతున్నాయన్నారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులను అందజేశారు. భాష్యం బ్లూమ్స్ జెడ్‌ఈఓ జోషి, గుంటూరు భాష్యం బ్లూమ్స్ జెడ్‌ఈవో వరలక్ష్మి, ప్రిన్సిపాల్ మహాలక్ష్మి పాల్గొన్నారు.

బ్రాస్‌లెట్ చోరీపై కేసు నమోదు

వన్‌టౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): సిటీబస్సులో ప్రయాణించిన కానూరుకు చెందిన మహిళ చేతి బంగారు బ్రాస్‌లెట్ చోరీకి గురైనట్లు శనివారం సూర్యారావుపేట పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కానూరు కృష్ణానగర్‌కు చెందిన సుల్తానా ఖాన్ (42) విజయవాడ అమెరికా హాస్పటల్ సమీపంలో ఉన్న తల్లిదండ్రుల వద్దకు పది రోజుల క్రితం ఆర్టీసీ బస్సులో కానూరు నుంచి అమెరికా హాస్పటల్ వద్దకు వచ్చింది. బస్సు దిగిన తరువాత ఆమె తన చేతికి ఉండవలసిన సుమారు 14 గ్రాముల బంగారు బ్రాస్‌లెట్ చోరీకి గురైంది. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	122, 131, 142
చికెన్ విత్ స్కిన్	232
చికెన్ స్కిన్‌లెస్	242



నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 660

అధికారుల గైర్హాజరుపై ఎంపీపీ కాసాని ఆగ్రహం

పమిడిముక్కల, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): సర్వసభ్య సమావేశానికి అన్ని శాఖల ఉద్యోగులు ఎందుకు రావడంలేదని పమిడిముక్కల ఎంపీపీ కాసాని వేదసుప్రజ ఆగ్రహం వ్యక్తంచేశారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీపీ వేదసుప్రజ అధ్యతన మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. సమావేశానికి 24 మంది అన్ని శాఖలకు చెందిన అధికారులు, ఉద్యోగులు హాజరు కావలసి ఉండగా, కొందరు రాకపోవడంపై ఎంపీపీ ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారుల గైర్హాజరుపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తానని హెచ్చరించారు. ఎంపీపీ సీతారామారాజు తదితరులు పాల్గొన్నారు.

మోటూరు పీహెచ్‌సీలో ప్రసవాలు



గుడివాడ రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): గుడివాడ రూరల్ మండలం మోటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మహిళలకు డెలివరీ నిర్వహిస్తున్నట్లు వైద్యులు దీప్తి తెలిపారు. శనివారం మోటూరు పీహెచ్‌సీలో గుంటా కోడూరు గ్రామానికి చెందిన 25 సంవత్సరాల మహిళకు డాక్టర్ డెలివరీ చేశారు. రూరల్ మండలంలోని ప్రజలు ఈ పీహెచ్‌సీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. మోటూరు ఆరోగ్య కేంద్రంలో అన్ని పరికరాలు ఉన్నట్లు తెలిపారు.

నిధులు వినియోగించుకోవాలి : ఎంపీపీ



వైద్యాధికారులతో ఎంపీపీ గద్దె పుష్పరాణి

గుడివాడ రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిధులు సక్రమంగా వినియోగించుకోవాలని ఎంపీపీ గద్దె పుష్పరాణి అన్నారు. శనివారం మోటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధి కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న నిధులు సక్రమంగా వినియోగిస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. భవిష్యత్‌లో మరిన్ని నిధులు తేవటానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో విష్ణుప్రసాద్, మోటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి దీప్తి పాల్గొన్నారు.

అర్థమయ్యేలా పాఠాలు బోధించాలి : ఎంఈవో-2



మాట్లాడుతున్న ఎంఈవో-2 బాలాజీ

గుడివాడ రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు అర్థమయ్యే విధంగా బోధించాలని ఎంఈవో-2 బాలాజీ అన్నారు. శనివారం గుడివాడ రూరల్, అర్బన్ పాఠశాలల ఉపాధ్యాయులకు ఎస్‌పీఎస్ పాఠశాల నందు అన్నీ సబ్జెక్టు లపై ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఉపాధ్యాయుడు నేర్చుకున్న అంశాలను తరగతి గదుల్లో బోధించాలన్నారు. సరళమైన పద్ధతిలో పిల్లలకు చెప్పినప్పుడు ఉపయోగం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గాంధీ మున్సిపల్ ప్రధానోపాధ్యాయులు ఎస్.జాని తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌జీఆర్‌కే పాఠశాలలో సంక్రాంతి శోభ



గుడివాడ రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): గుడివాడ మండలంలోని స్కూల్ కాంప్లెక్స్ శిక్షణ తరగతులను పురస్కరించుకుని ఎస్‌జీఆర్‌కే పాఠశాలను శనివారం అందంగా ముస్తాబు చేశారు. ఉపాధ్యాయురాలు భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో రంగవల్లులు, గొబ్బెమ్మలు, చెరకు గెడలతో ప్రత్యేకంగా అలంకరించారు. సంక్రాంతి ముందుగానే వచ్చినట్లుగా ఉందని ఎంఈవో-2 బాలాజీ ఆనందం వ్యక్తం చేశారు.

ముగిసిన మహిళా సమాఖ్య శిక్షణ



శిక్షణ పొందిన మహిళా సమాఖ్య సిబ్బంది

గుడ్లవల్లేరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండల మహిళా సమాఖ్య వార్షిక కార్యాచరణ మోడ్యూల్ -2పై గుడ్లవల్లేరు వెలుగు కార్యాలయంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు శనివారంతో ముగిశాయి. జిల్లాలోని ఎనిమిది మండలాల్లో మొదటి విడత మోడల్ మండల సమాఖ్యలకు, గుడ్లవల్లేరు నవ్యా మండల సమాఖ్యల సిబ్బందికి శిక్షణనిచ్చారు. ఈ సందర్భంగా 2026-27 సంవత్సర కార్యాచరణను రూపొందించామని గుడ్లవల్లేరు మండల ఏపీఎం పాండు రంగప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో నర్రా సత్యభామ, మహంకాళరావు, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా స్వామిత్వ సర్వే జరగాలి

● డీఎల్‌డీవో రాజేష్



పామర్రు చాట్లవానిపురంలో స్వామిత్వ సర్వేను పరిశీలిస్తున్న డీఎల్‌డీవో రాజేష్, డిప్యూటీ ఎంపీడీవో జనార్ధనరావు తదితరులు

పామర్రు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రజల నివాస ప్రాంతాలకు సంబంధించి వారి ఆస్తిపై పూర్తి హక్కు కల్పించేలా చేపట్టిన స్వామిత్వ సర్వేను పారదర్శకంగా నిర్వహించాలని ఉయ్యూరు డీఎల్‌డీవో పి.రాజేష్ అన్నారు. పామర్రు పరిధిలోని చాట్లవానిపురం ఎస్సీ కాలనీలో గ్రామ సచివాలయ ఉద్యోగులు నిర్వహిస్తున్న స్వామిత్వ సర్వేను ఆయన శనివారం పరిశీలించారు. సర్వే నిర్వహిస్తున్న ఉద్యోగులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్తులు కూడా స్వామిత్వ సర్వేకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో జనార్ధనరావు, ఇంజనీరింగ్ సహాయకులు పూజ, తనూజ, నవీన్, కాశీవిశ్వనాథ్, గ్రామ సర్వేయర్లు నిహారిక, హాఫిజ్‌ఆలీ, భవానీ పాల్గొన్నారు.



యంత్రాలతో ధాన్యం నూర్పిడి



ధాన్యాన్ని బస్తాల్లోకి ఎత్తుతున్న కూలీలు

ముమ్మరంగా వరి కోతలు

పెదపారుపూడి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలో వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. వాతావరణంలో మార్పులు, వర్ష సూచనలు ప్రచారంలో ఉన్న నేపథ్యంలో రైతులు హడావిడిగా వరి కోతలకు పరుగులు తీస్తున్నారు. మండలంలోని 18,400 వేల ఎకరాలలో వరి సాగు చేయగా, ఇప్పటి వరకు 1,700 ఎకరాలలో కోతలు పూర్తయ్యాయి. దాదాపు అందరూ రైతులు వరి కోత యంత్రాలపై ఆధార పడి ఉన్నారు. మండలంలో సుమారు 20 యంత్రాల ద్వారా కోతలు కొనసాగుతున్నాయి. అయితే గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది మండలానికి రావాల్సిన వరి కోత యంత్రాలు రాలేదని రైతులు చెబుతున్నారు. యంత్రాల కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రభుత్వం చొరవ తీసుకొని వరి కోత యంత్రాలను సర్దుబాటు అయ్యేలా చూడాలని కోరుతున్నారు.

స్వచ్ఛ గుడివాడకు దాతల సాయం అభినందనీయం

● ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

● గౌతమ్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 2 ట్రాక్టర్లు, 2 ట్రాలీలు వితరణ



ట్రాక్టరుకు జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల, అవినాష్ తదితరులు

గుడివాడ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ గుడివాడకు డాక్టర్ కెకెఆర్స్ గౌతమ్ విద్యాసంస్థల చైర్మన్ కొసరాజు అవినాష్ రూ.20 లక్షల విలువైన రెండు ట్రాక్టర్లను అందించడం అభినందనీయమని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గౌతమ్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పట్టణంలో పారిశుద్ధ్యం మెరుగుదలకు ఉపయోగపడే ట్రాక్టర్లను మున్సిపల్ కమిషనర్ సింహాద్రి మనోహర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణాన్ని సుందరవనంగా తీర్చిదిద్దేందుకు దాతల సహకారం ఎంతో అవసరమని గుర్తించి చెత్తను సేకరించేందుకు అవినాష్ రెండు ట్రాక్టర్లు, ట్రాలీలను అందజేశారన్నారు. అవినాష్‌ను ఆదర్శంగా తీసుకుని పట్టణాభివృద్ధికి మరింత మంది దాతలు సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కెకెఆర్స్ గౌతమ్ విద్యాసంస్థల చైర్మన్ కొసరాజు అవినాష్, ఎన్‌టీఆర్ స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు యలవర్తి శ్రీనివాసరావు, జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ మజ్జాడ నాగరాజు, టీడీపీ నాయకులు వాసే మురళీ, లింగం ప్రసాద్, గోర్జి సత్యనారాయణ, నిమ్మగడ్డ సత్యసాయి, పంద్రాజు సాంబశివరావు, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రూ.12కోట్లతో విద్యుత్ అభివృద్ధి పనులు

గుడివాడ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ప్రజలందరికీ నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడమే లక్ష్యంగా రూ.12 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము తెలిపారు. శనివారం స్థానిక ప్రజావేదికలో విద్యుత్ శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. నియోజకవర్గ వ్యాప్తంగా రూ.3.08కోట్ల నిధులతో చేపట్టిన అభివృద్ధి పనుల వివరాలను ఎమ్మెల్యేకు అధికారులు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ వ్యవస్థలు అస్తవ్యస్తంగా ఉన్నాయన్నారు. ఈఈ జి.బి శ్రీనివాసరావు, ఏ.డి.ఈలు బాపిరాజు, కిరణ్‌బాబు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం కొనండి



ఆరబెట్టిన ధాన్యం రాశులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా

● ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా

పామర్రు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత వాతావరణ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని అన్నదాతలను ఇబ్బంది పెట్టకుండా ధాన్యం కొనుగోలు చేయాలని రైస్ మిల్లర్లకు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా సూచించారు. మండల పరిధిలోని కురుమద్దాలిలో జాతీయ రహదారులపై రైతులు ఆరబెట్టి బస్తాల్లో ఉంచిన ధాన్యాన్ని అధికారులతో కలిసి శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు పండించిన ప్రతి పంట ఉత్పత్తులను మద్దతు ధరకు కొనుగోలు చేసేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుందని రైతన్నలకు ధైర్యం చెప్పారు. తేమశాతంలో తేడాలు రాకుండా చర్యలు తీసుకోవాలని ఆర్ఎస్‌కే సిబ్బందిని ఆదేశించారు. రైతులకు నేటి వరకు కొనుగోలు చేసిన ధాన్యం తాలుకా చెల్లించవలసిన నగదును రైతుల ఖాతాల్లో 24 గంటల్లోనే జామ చేస్తున్నామన్నారు. నియోజకవర్గంలో రైతుల ధాన్యం రవాణాకు అవసరమైన వాహనాలు, టార్పాలిన్లు, గోనె సంచులు అన్ని మండలాల్లో అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకున్నామన్నారు. ధాన్యం తరలించిన తర్వాత ఏ మిల్లు వారైన, అధికారులైన ఇబ్బందులు పెడితే నేరుగా తన సెల్‌కు 97059 12243 నెంబరుకు ఫోన్ చేసి తెలపాలన్నారు. కార్యక్రమంలో కృష్ణాడెల్టా ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ వల్లూరిపల్లి గణేష్, జక్కు శ్రీనివాసరావు, తహసీల్దార్ గూడపాటి రవికాంత్ పాల్గొన్నారు.

గుడివాడ మున్సిపల్ ప్రత్యేక అధికారి పదవీకాలం ఆరు నెలలు పొడిగింపు

గుడివాడ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : గుడివాడ మున్సిపల్ ప్రత్యేక అధికార పదవీ కాలాన్ని మరో ఆరు నెలలు పాటు పొడిగిస్తూ ప్రభుత్వ ప్రిన్సిపల్ కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్ శనివారం ఉత్తర్వులు జారీచేశారు. రాష్ట్రంలోని 9 మున్సిపాలిటీల ప్రత్యేక అధికారుల పదవీ కాలాన్ని ఈ నెల 6వ తేదీ నుంచి 2026, మే 5వ తేదీ వరకు పొడిగించారు. ఎన్నికలు జరిగే వరకు లేదా ఆరు నెలలు పూర్తి అయ్యేవరకు ప్రత్యేక అధికారులు విధుల్లో కొనసాగుతారు.

కోడి పందేల శిబిరంపై దాడి

గుడివాడ రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బిళ్లపాడు గ్రామంలో నిర్వహిస్తున్న కోడి పందేలపై శిబిరంపై గుడివాడ రూరల్ పోలీసులు శనివారం సాయంత్రం దాడి చేశారు. ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. రెండు మోటార్ సైకిళ్లు, ఒక కోడిపుంజు, రూ.2,300 నగదు, రెండు కోడి కత్తులు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలి

● సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్‌సీపీ రెడ్డి



నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

గుడివాడ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్‌సీపీ రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం స్థానిక శ్రీనివాస సెంటర్‌లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చెబుతున్న విధంగా కార్మికులకు ఎటువంటి ఉపయోగం ఉండదని ఆరోపించారు. మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను నివారించేందుకు ఈ కోడ్‌లు ఉపయోగపడవన్నారు. కార్మికులకు పని ప్రదేశంలో జరిగే ప్రమాదాలకు యాజమాన్యంపై ఎలాంటి చర్యలు తీసుకునే హక్కు లేకుండా పోతుందన్నారు. వెంటనే నాలుగు కోడ్‌లను రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు నీలం మురళీ కృష్ణారెడ్డి, విజయ్‌కుమార్, ఎస్.శ్రీనివాస్, వై.వి.సుబ్బారావు, ఏ.వెంకటేశ్వరరావు, ఝూన్సీ నాని, అజిత్, అజీస్ తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల వ్యతిరేక ర్యాలీ



గుడ్లవల్లేరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మాదక ద్రవ్యాల మత్తులో పడి యువశక్తి నిర్వీర్యం అవుతుండటం ఆందోళన కలిగిస్తోందని శేషాద్రి రావు గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాల (ఎస్ఆర్ జీఈసి) ప్రిన్సిపాల్ డాక్టర్ బుర్రా కరుణకుమార్ అన్నారు. శనివారం ఎన్‌సీసీ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా కళాశాల ఎన్‌సీసీ విభాగం ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల వ్యతిరేక అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ప్రిన్సిపాల్ కరుణకుమార్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా మాదక ద్రవ్యాల వ్యాపారం యువతే లక్ష్యంగా చేసుకొని విస్తరిస్తోందని తెలిపారు. మాదకద్రవ్యాల వినియోగం నేరమని, దోషులకు కఠిన శిక్షలు ఉన్నాయని చెప్పారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డైరెక్టర్ డాక్టర్ పి.సిద్దయ్య, యాజమాన్య సలహాదారు డాక్టర్ పి.రవీంద్రబాబు, వైస్‌ప్రిన్సిపాల్స్ డాక్టర్ పి.కోదండ రామారావు, డాక్టర్ ఎంఆర్‌సీహెచ్‌శాస్త్రి, ఎన్‌సీసీ కేర్‌టేకర్ ఎమ్.కరమ్‌చంద్ పాల్గొన్నారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా శ్రీమన్నారాయణ



జోగికి నియామకపత్రం అందిస్తున్న శ్రీరామ్

కూచిపూడి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): బీజేపీ మొవ్వ మండల అధ్యక్షుడిగా జోగి శ్రీమన్నారాయణ నియమితులయ్యారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు తాతినేని శ్రీరామ్ నియామకపు పత్రాన్ని శ్రీమన్నారాయణకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి తుంగల మురళీ, ఏఎంసీ చైర్మన్ దోనేపూడి శివరామయ్య, ఓబీసీ జిల్లా అధ్యక్షుడు పి.అశోక్‌కుమార్, నాయకులు తాతా హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

త్రివేణి విద్యార్థులకు బహుమతులు



గుడివాడ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : స్థానిక త్రివేణి ఇంగ్లీషు మీడియం విద్యార్థులు 20 మంది ఇటీవల షా గులాబ్‌చంద్ ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో జరిగిన 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో నిర్వహించిన వివిధ పోటీల్లో బహుమతులను సాధించినట్లు పాఠశాల డైరెక్టర్ నిమ్మగడ్డ శివశంకర్ తెలిపారు. శనివారం స్థానిక పాఠశాల ఆవరణలో విద్యార్థులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	122, 131, 142
చికెన్ విత్ స్కిన్	232
చికెన్ స్కిన్‌లెస్	242

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 660

బిల్డింగ్ పీనలైజేషన్ పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

మచిలీపట్నం టౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): 1985 నుంచి 2025 ఆగస్టు 31 వరకు అనధికారికంగా నిర్మించిన, అనుమతి పొందిన ప్లాన్లకు భిన్నంగా నిర్మించిన భవనాలను క్రమబద్ధీకరించుకునేందుకు బిల్డింగ్ పీనలైజేషన్ పథకం ద్వారా ప్రభుత్వం అనుమతించిందని సద్వినియోగం చేసుకోవాలని యజమానులకు కమిషనర్ బాపిరాజు సూచించారు. నగర పాలక సంస్థ పరిధిలో అనుమతులకు భిన్నంగా నిర్మించిన భవనాల క్రమబద్ధీకరణకు 120 రోజుల్లోగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రాథమిక ఫీజు రూ.10వేలు చెల్లించాలన్నారు. అపార్ట్‌మెంట్లకు రిజిస్టర్ దస్తావేజులు, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం జారీ చేసిన ఈసీలు, మార్కెట్ వాల్యూ సర్టిఫికెట్ కాపీలు, అనుమతి పొందిన బిల్డింగ్ ప్లాన్ కాపీలు, ప్రస్తుత భవనం ఫోటోలు, రోడ్డు విస్తరణ సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు, ఈమెయిల్ అడ్రస్, ఇంటి, కుళాయి పన్ను రశీదులను జతపరచాలన్నారు.



ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌కు పుష్పగుచ్ఛం అందించి ప్రభుత్వానికి కృతజ్ఞతలు చెబుతున్న బుక్‌కీపర్లు

కూటమి ప్రభుత్వానికి బుక్‌కీపర్ల కృతజ్ఞతలు

అవనిగడ్డ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): తమకు ఉద్యోగ భద్రత కల్పించిన ప్రభుత్వ సహాయం మరువలేనిదని వీవోఏల సంఘం రాష్ట్రకార్యదర్శి కొల్లూరి నాని అన్నారు. శనివారం ఎమ్మెల్యే కార్యాలయంలో నాని ఆధ్వర్యంలో వీవోఏలు(బుక్ కీపర్లు) ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిసి ప్రభుత్వం చేసిన మేలు పట్ల ధన్యవాదాలు తెలిపారు. ఎమ్మెల్యేను సత్కరించారు. సుదీర్ఘకాలం నుంచి తమకు ఉద్యోగభద్రత భరోసా లేకుండా చేసిన మూడేళ్ల కాలపరిమితి జీవోను ప్రభుత్వం రద్దు చేయడం హర్షణీయమన్నారు. సంఘ ప్రతినిధులు, వీవోఏలు తుంగల లక్ష్మి, రేపల్లె రజని, తోట రాజేశ్వరి, గాజుల వాణి, అనిత పాల్గొన్నారు.



కృష్ణలీల హీరో దేవన్‌ను సన్మానిస్తున్న చల్లపల్లి గ్రామ ప్రముఖులు, వివిధ పార్టీల నేతలు

చల్లపల్లిలో హీరో దేవన్ సందడి

చల్లపల్లి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఇటీవల విడుదలైన కృష్ణలీల సినిమా హీరో, దర్శకుడు యర్రంశెట్టి దేవన్ శనివారం గ్రామంలో సందడిచేశారు. చల్లపల్లికి చెందిన బ్యాంకు భాస్కరరావు కుమారుడు దేవన్ స్వగ్రామంలో బంధువుల పెళ్లికి హాజరయ్యేందుకు వచ్చారు. దేవన్‌ను, తండ్రి బ్యాంకు భాస్కరరావును న్యాయవాది తుటారం ప్రసాద్ ఆధ్వర్యంలో గ్రామ ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నేతలు సన్మానించారు. స్వగ్రామంలో పెద్దల ఆశీస్సులు, ప్రజల ఆదరణ మరిచిపోలేనని దేవన్ తెలిపారు. విశ్రాంత హెచ్ఎం జీ.వీ.తాతారావు, సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, ఏఎంసీ చైర్‌పర్సన్ తోట కనకదుర్గ, సొసైటీ చైర్మన్ బొందలపాటి వీరబాబు, ప్రముఖులు డాక్టర్ శివప్రసాద్, దాసి సీతారామరాజు, అడ్డాడ ప్రసాద్‌బాబు, యడ్ల మధుసూదనరావు, బోలెం రామారావు, కైతేపల్లి దాస్, కేశనకుర్తి శరత్‌బాబు, కస్తూరి ప్రసాద్, మీర్ రిజ్వాన్, షేక్ నసీంషెహోరీ, రావి రాజు, పిట్టి రాంబాబు, ఉప్పల సాంబశివరావు, ప్రెస్ పూర్ణ తదితరులు పాల్గొన్నారు.

సుబ్బారాయుడి సేవలో దేవదాయశాఖ ఆర్‌జేసీ

మోపిదేవి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని శనివారం దేవదాయ శాఖ రీజినల్ జాయింట్ కమిషనర్ చంద్రశేఖర ఆజాద్ దర్శించుకున్నారు. నాగపుట్టలో పాలు పోసి విశేష పూజలు చేశారు. అర్చక బృందం వేదమంత్రాలతో ఆశీర్వచనం పలికి శేషవస్త్రాలతో సత్కరించారు. ఆలయ పర్యవేక్షకుడు మధుసూదనరావు స్వామి చిత్రపటం, ప్రసాదాలను ఆర్‌జేసీకి అందించారు.



ఆర్‌జేసీ చంద్రశేఖర ఆజాద్‌కు ప్రసాదం అందిస్తున్న ఆలయ అధికారి

చర్మవ్యాధులు రాకుండా

పశువులకు వ్యాక్సిన్ వేయించండి

మచిలీపట్నం టౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): చర్మ వ్యాధులు రాకుండా ప్రభుత్వం ఉచితంగా ఇచ్చే ఎల్ఎస్‌డీ వ్యాక్సిన్‌ను పశువులకు వేయించాలని పెంపకం దారులకు జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి ఎస్ సీహెచ్ నరసింహులు సూచించారు. చింతగుంటపాలెంలోని గోశాలలో శనివారం డాక్టర్ నరసింహులు పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించి వ్యాక్సిన్లు వేశారు. ఆవులకు ముద్ద చర్మ వ్యాధి రాకుండా వ్యాక్సినేషన్ కార్యక్రమం చేపట్టామన్నారు. బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పి.వి. ఫణికుమార్, అర్బన్ బ్యాంకు మాజీ చైర్మన్ పల్లపోతు సుబ్రహ్మణ్యం, పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ నాగభూషణబాబు, అసిస్టెంట్ డైరెక్టర్ కె.రాధాకృష్ణమూర్తి పాల్గొన్నారు.



ఆవులకు చికిత్స చేస్తున్న పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి నరసింహులు



గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న తెలుగురైతు జిల్లా అధ్యక్షుడు గోపు సత్యనారాయణ

క్రీడలతో మానసిక ఉల్లాసం

మచిలీపట్నం టౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని మార్కెట్ యార్డు మాజీ చైర్మన్, తెలుగురైతు జిల్లా అధ్యక్షుడు గోపు సత్యనారాయణ అన్నారు. బందరు మండలం కానూరు హైస్కూల్‌లో శనివారం విద్యార్థులకు వివిధ క్రీడా పోటీలు నిర్వహించారు. విజేతలకు గోపు సత్యనారాయణ బహుమతులు అందజేశారు. కానూరు హైస్కూల్ నిర్మాణానికి తమ వంతుగా ఉచితంగా స్థలం ఇచ్చామన్నారు. పోటీలు నిర్వహించి ముందుకు వచ్చిన క్రై సంస్థను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో బొలిశెట్టి నాని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాక్ అసెంబ్లీలో పాల్గొనే అవకాశం కల్పించండి

● విద్యాశాఖ అధికారులకు లింగారెడ్డిపాలెం హైస్కూల్ విద్యార్థిని కడవకొల్లు హేమాంజలి విజ్ఞప్తి

కోడూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మాక్ అసెంబ్లీకి విద్యార్థుల ఎంపికలో విద్యాశాఖ అధికారులు ముందుగా ఇచ్చిన నిబంధనలు అనుసరించి ప్రతిభకు ప్రాధాన్యమివ్వాలని, తనకు మాక్ అసెంబ్లీలో నియోజకవర్గం తరపున పాల్గొనే అవకాశం కల్పించాలని లింగారెడ్డిపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థిని కడవకొల్లు హేమాంజలి కోరింది. నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన మాక్ అసెంబ్లీ ఎంపిక పోటీల్లో తాను ప్రథమ స్థానంలో నిలిచానని తెలిపింది. కానీ విద్యాశాఖ అధికారులు ముందుగా ప్రకటించిన నిబంధనలు అనుసరించకుండా మూడో స్థానంలో నిలిచిన విద్యార్థిని పేరు ప్రతిపాదించారని తెలిపింది. దీనిపై అధికారులు పునరాలోచన చేయాలని, తనకు మాక్ అసెంబ్లీలో పాల్గొనే అవకాశం కల్పించాలని కోరింది.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

● వాతావరణంలో మార్పులు, వాయుగుండం హెచ్చరికల కారణంగా ధాన్యం సురక్షిత ప్రాంతాలకు తరలించుకోవాలి: టీడీపీ నేతలు

మోపిదేవి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): వాతావరణంలో వస్తున్న మార్పులు, వాయుగుండం హెచ్చరికల నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండి, వరి కోతలు, నూర్పిళ్లలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని దివి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు సూచించారు. టీడీపీ నాయకులతో కలిసి ఆయన పలు గ్రామాల్లో పర్యటించి ధాన్యాన్ని పరిశీలించారు. మండలంలో నూర్పిడి చేసిన ధాన్యాన్ని వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలించుకునే ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. మోపిదేవి, పెదప్రోలు, శివరామపురం, వెంకటాపురం గ్రామాల్లో యంత్రాల ద్వారా వరి కోత నూర్పిడిలు చురుగ్గా సాగుతున్నాయి. నూర్పిడి చేసిన ధాన్యాన్ని ఖాళీ ప్రదేశాలు, రహదారుల వెంబడి ఆరబెట్టగా, ధాన్యాన్ని టీడీపీ నేతలు పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. ప్రస్తుతం తేమశాతం నిబంధనలు రైతులకు ఇబ్బందికరంగా లేవని, ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేసే అవకాశం కల్పిస్తోందని తెలిపారు. రైతులకు అవసరమైన గోనె సంచులు, వాహనాలు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. టీడీపీ మండల అధ్యక్షుడు నడకుదుటి జనార్ధనరావు, నాయకులు రావి నాగేశ్వరరావు, బల్లా సీతారామ ప్రసాద్, తోట సాయి, పుప్పాల యేసు పాల్గొన్నారు.



మోపిదేవిలో ఆరబెట్టిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న టీడీపీ నేతలు

ధాన్యం రాశుల పరిశీలన

పెడన రూరల్: వాతావరణంలో మార్పులతో రైతులు ఆందోళన చెందుతున్న తరుణంలో వ్యవసాయ, రెవెన్యూ అధికారులు గురివిందగుంట, కొంగంచర్ల గ్రామాలలో రోడ్లపక్కన ఉంచిన ధాన్యం రాశులను శనివారం పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. ధాన్యం ఆరబెట్టేందుకు ప్రభుత్వం ఉచితంగా టార్పాలిన్లు ఇస్తుందని తహసీల్దార్ కె.అనిల్‌కుమార్ తెలిపారు. కొందరు రైతులకు టార్పాలిన్లు అందించారు. ధాన్యం బాగా ఆరబెట్టాలని లేదంటే రంగు మారి సరైన ధర రాదని ఏవో జెన్నీ రైతులకు తెలిపారు. రెండు రోజుల్లో 700 మెట్రిక్ టన్నుల ధాన్యం మిల్లులకు పంపామన్నారు. ఆర్ఐ విజయలక్ష్మి, మధుబాబు, నాయక్ పాల్గొన్నారు.



గురివిందగుంటలో ధాన్యం రాశులను పరిశీలిస్తున్న అధికారులు

వరి కోతలు వాయిదా వేసుకోవాలి

నాగాయలంక: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా మారి కోస్తాంధ్రలో వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరిస్తున్న నేపథ్యంలో మండలంలోని రైతులు వరి కోతలను ఈ నెలాఖరు వరకు వాయిదా వేసుకోవాలని ఏవో ఎ.సంజీవ్ కుమార్ తెలిపారు. తప్పనిసరి పరిస్థితుల్లో కోతలను కోస్తే అందుబాటులో ఉన్న రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలని ఆయన సూచించారు.

రైతులు, కౌలు రైతుల సమస్యలు పరిష్కరించాలి

చల్లపల్లి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): రైతులు, కౌలురైతుల సమస్యలు పరిష్కరించాలని రైతుసంఘం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట శనివారం నాయకులు ఆందోళన నిర్వహించారు. వ్యవసాయంలో 80శాతం కౌలురైతులే పంటలు పండిస్తున్నారని, ప్రకృతి విపత్తులు వచ్చినప్పుడు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. కౌలురైతులకు అన్నదాత సుఖీభవ పథకంలో రూ.20వేలు జమచేయాలని డిమాండ్ చేశారు. మొంథా తుఫాన్ వల్ల నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. రైతు భరోసా కేంద్రాల్లో చూపిన తేమశాతం కన్నా మిల్లర్లు ఎక్కువ తేమశాతం చూపుతున్నారని అన్నారు. తేమశాతంతో సంబంధం లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం డీటీ శ్రీలతకు వినతిపత్రం అందజేశారు. రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు యద్దనపూడి మధు, మందపాకల గోవిందరాజులు, గోళ్ల సాంబశివరావు, వెనిగళ్ల వసంతరావు, బండారు కోటేశ్వరరావు, గొరిపర్తి సత్యనారాయణ, కోలా శివసత్యహరిబాబు, మహమ్మద్ కరీముల్లా పాల్గొన్నారు.



డీటీ శ్రీలతకు వినతిపత్రం అందిస్తున్న రైతు సంఘం నాయకులు

కేయూలో ఎన్‌సీసీ వేడుకలు

మచిలీపట్నం టౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఎన్‌సీసీ విద్యార్థులు క్రమశిక్షణతో పాటు సేవాతత్పరతను అలవరచుకోవాలని కృష్ణా విశ్వవిద్యాలయం ఉపకులపతి కూన రాంజీ అన్నారు. శనివారం కృష్ణా విశ్వవిద్యాలయంలో ఎన్‌సీసీ వేడుకలు నిర్వహించారు. మాదక ద్రవ్యాలు, అక్రమ రవాణా నిరోధంపై అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థుల వ్యక్తిత్వ వికాసంలో ఎన్‌సీసీ కీలక పాత్ర పోషిస్తుందని ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆర్.విజయకుమారి అన్నారు. లెఫ్టినెంట్ డి.రామశేఖరరెడ్డి పాల్గొన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన విన్యాసాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి.



కృష్ణా విశ్వవిద్యాలయంలో ఎన్‌సీసీ విద్యార్థుల ర్యాలీ

పైడమ్మ ఆలయంలో వేలం

పెడన, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పైడమ్మ జాతర ఉత్సవాలలో వివిధ హక్కులు పొందేందుకు శనివారం దేవదాయ అధికారులు వేలం నిర్వహించారు. లడ్డూ ప్రసాదం విక్రయించుకునేందుకు రూ. లక్షా 2వేలు, చీరలకు రూ. లక్షా 52వేల 55, ఆలయం చుట్టూ శిడిబండ్ల ఊరేగింపునకు రూ.72 వేలు ఆదాయం సమకూరింది. మరి కొన్నింటికి ఈనెల 26న తిరిగి వేలం పాటలు నిర్వహిస్తామని ఈవో గోవాడ వెంకటకృష్ణారావు తెలిపారు. ఆలయ వంశపారంపర్యధర్మకర్త దాసు వాయునందనరావు పాల్గొన్నారు.

గోల్డ్‌కాయిన్లు అందజేత

పెడన, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కల్యాణమస్తు పథకంలో భాగంగా పెళ్లిళ్లు చేసుకున్న పాల సంఘాల సభ్యుల పిల్లలకు కృష్ణా మిల్క్ యూనియన్ డైరెక్టర్ అర్జా వెంకటనగేష్ శనివారం గోల్డ్ కాయిన్లు అందచేశారు. మడక పాల సంఘం సభ్యుడు బొర్రా వీరవెంకటేశ్వరరావు కుమార్తె, పాల సంఘం సభ్యుడు జోగి నాగేంద్రుడు కుమారుడు, నడుపూరు పాల సంఘం సభ్యుడు శివకోటి శ్రీనివాసరావు కుమార్తె, బల్లిపర్రు పాల సంఘం సభ్యుడు ముక్కు సుబ్రహ్మణ్యం కుమార్తెకు వెంకటనగేష్ గోల్డ్ కాయిన్లు అందజేశారు. గుడ్లవల్లేరు చిల్లింగ్ సెంటర్ మేనేజర్ దామోదర కృష్ణ గోపీనాథ్, సూపర్‌వైజర్ పెయ్యేటి బసవరాజ్‌కుమార్, పాల సంఘాల అధ్యక్షులు చీర్ల కృష్ణ, జోగి సుబ్బారావు, రబ్బానీ బేగ్ పాల్గొన్నారు.

ప్రాంగణ ఎంపికలు

గూడూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): చిట్టిగూడూరులోని శ్రీ నారసింహ ఐటీఐ కళాశాలలో శనివారం విద్యార్థులకు ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. మోడీని ధర్మల్ కంపెనీ, అపోలో టైర్స్, శ్రీసిటీ ఎంఆర్ఎఫ్ టైర్స్ వారు కళాశాలకు విచ్చేసి విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. ఇరవై మంది ఉద్యోగాలు సాధించినట్లు కరస్పాండెంట్ అరుణకుమారి తెలిపారు. ఎంపికయిన విద్యార్థులను వైస్‌ప్రిన్సిపాల్ చింతగుంట వెంకటేష్, లెక్చరర్ చింతగుంట ఆకాష్ అభినందించారు.

ప్లాస్టిక్ వాడకాన్ని మానేయాలి

● ఐఆర్‌సీఎస్ జిల్లా చైర్మన్ డాక్టర్ డీఆర్కే ప్రసాద్

చల్లపల్లి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఒక్కసారి వాడిపారేసే ప్లాస్టిక్ వస్తువులను వాడటం మానేయాలని, స్టీలు గ్లాసులు, ప్లేట్ల వినియోగంపై దృష్టిసారించాలని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్, స్వచ్ఛ చల్లపల్లి సారథి డాక్టర్ డీఆర్కే ప్రసాద్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. డాక్టర్ పట్టాభి రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్, ఐఆర్‌సీఎస్ జిల్లా కార్యాలయంలో వినియోగించేందుకు స్టీలు భోజనం పళ్లాలు, టిఫిన్ ప్లేట్లు, మంచినీరు తాగేందుకు స్టీలు గ్లాసులు, టీ గ్లాసుల కొనుగోలుకు స్వచ్ఛ కార్యకర్త వేమూరి అర్జునరావు మాస్టారి జ్ఞాపకార్థం కుమారుడు వేమూరి మురళి డాక్టర్ డీఆర్కే ప్రసాద్‌ను కలిసి స్టీలు సామాన్ల కొనుగోలుకు రూ.8125 అందించారు. ఆ విరాళంతో స్టీలు వస్తువులు కొనుగోలుచేసి మచిలీపట్నం ఐఆర్‌సీఎస్ కార్యాలయంలో అందుబాటులో ఉంచారు.

శ్మశానవాటికలో

ముళ్లపొదల తొలగింపు

మోపిదేవి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కె.కొత్తపాలెం గ్రామంలో శ్మశానవాటిక, రహదారుల వెంబడి జంగిల్ క్లియరెన్స్ పనులు శనివారం చేపట్టారు. గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో చేపట్టిన పనులను సర్పంచ్ కొక్కిలిగడ్డ మాధవి ప్రారంభించారు. కృష్ణానది ఒడ్డున ఉన్న శ్మశాన వాటిక, గ్రామం నుంచి చల్లపల్లి వైపు వెళ్లే ప్రధాన రహదారికి ఇరువైపులా ముళ్లపొదల చెట్లను తొలగించారు. మండల పరిషత్ కో-ఆప్షన్ సభ్యుడు చందన రంగారావు, పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, శేషు, అనీల్ ఉన్నారు.

పరిసరాలు

పరిశుభ్రంగా ఉంచుకోవాలి

అవనిగడ్డ రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని పులిగడ్డ సర్పంచ్ దాసరి విజయ్‌కుమార్ సూచించారు. పులిగడ్డ పంచాయతీ పరిధిలో 2, 3 వార్డుల్లో డ్రెయినేజీ నిండిపోయి అధ్వానంగా ఉండడంతో సర్పంచ్ దాసరి విజయ్‌కుమార్, ఈవో అనిత స్పందించారు. పంచాయతీ సిబ్బందితో డ్రెయినేజీలో మురుగు బయటికి తీయించి వాటిని శుభ్రం చేయించారు. వార్డుసభ్యుడు చెన్ను రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న ఆరుగురి అరెస్టు

కృత్తివెన్ను, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయాలు జరుపుతున్న ఆరుగురిని శుక్రవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సీఐ నాగేంద్ర ప్రసాద్, ఎస్సై పైడిబాబు శనివారం పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. 'చినపాండ్రాక రామాపురం గ్రామంలో గంజాయి విక్రయాలపై సమాచారం రావడంతో పోలీసులు దాడులు చేశారు. గంజాయిని కలిగి ఉన్న ఆరుగురిని అదుపులోకి తీసుకొని విచారించారు. పశ్చిమ బెంగాల్‌కు చెందిన సోమనాథ్ బిక్రం(27) రామాపురంలో చెరువుల మీద పనిచేస్తూ, వెస్ట్ బెంగాల్ నుంచి గంజాయిని తుచ్చి, మచిలీపట్నానికి చెందిన భూక్యా శివాజీ (24), షేక్ ఆరీఫ్(24), ఉసత్తు దుర్గారావు(29), రామాపురానికి చెందిన పారుపాటి వినయ్‌కుమార్ (24), కారాడి ఆనంద్(23)కు విక్రయిస్తున్నాడు. వీరిపై కేసు నమోదు చేసి, బంటుమిల్లి కోర్టుకు రిమాండ్ నిమిత్తం తరలించాం.' అని సీ ఐ, ఎస్సై తెలిపారు.

అయ్యప్పస్వామికి పూజలు

పెడన, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కొల్లూరి వంశీయుల ఆధ్వర్యంలో కన్యకా పరమేశ్వరీదేవి ఆలయ ప్రాంగణంలోని అయ్యప్ప స్వామి ఉపాలయంలో శనివారం విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో భజన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అయ్యప్పలు, శివస్వాములకు, భవానీల కు చద్ది ఏర్పాటు చేశారు. పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కొల్లూరి చిన్నా, కొల్లూరి రా జా, కొల్లూరి రాధాకృష్ణ, ఉదయగిరి గోపాల సూర్యనారాయణ, మంజులత, పద్మ, కొమ్మూరి విజయదుర్గ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ

అందరి బాధ్యత

పెడన, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు ఉపకరించే చెట్లను పెంచాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అప్సా జిల్లా అధ్యక్షుడు అనుముకొండ గౌరీప్రసాద్ అన్నారు. వాప్ సంస్థ ఆధ్వర్యంలో విశ్వభారతి హైస్కూల్‌లో పర్యావరణ పరిరక్షణపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ రీ సైక్లింగ్‌కు సహకరిస్తే చెట్లను కాపాడుకోవచ్చని వాప్ ప్రతినిధి రాజు తెలిపారు. వివిధ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు.

మోపిదేవి ఎస్సైగా గౌతమ్‌కుమార్

మోపిదేవి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మోపిదేవి ఎస్సైగా పి.గౌతమ్ కుమార్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. బదిలీల్లో భాగంగా గుడివాడ-1 టౌన్ నుంచి అటాచ్‌మెంట్‌పై మోపిదేవికి ఆయన వచ్చారు. సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశాక, అవుట్ పోస్ట్ పోలీస్ స్టేషన్‌లో విధుల్లో చేరారు. సిబ్బంది ఎస్సైను కలిసి అభినందనలు తెలిపారు.

29, 30 తేదీల్లో భగవద్గీత పోటీలు

మచిలీపట్నం టౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): బచ్చుపేట వేంకటేశ్వరస్వామి దేవాలయంలోని కల్యాణ మండపంలో ఈనెల 29, 30 తేదీల్లో నిర్వహించే భగవద్గీత కంఠస్థ పోటీల్లో విద్యార్థులు, పెద్దలు పాల్గొనాలని టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ శ్రీవారి సేవకుడు తురగా ప్రసాద్ పిలుపునిచ్చారు. శనివారం దేవస్థానం కల్యాణ మండపంలో ఆయన మాట్లాడారు. 29న సాయంత్రం 4 గంటలకు 18 నుంచి 45 ఏళ్లలోపు వారికి నిత్య జీవితంలో భగవద్గీత అనే అంశంపై వక్తృత్వ పోటీలు నిర్వహిస్తామన్నారు. 30వ తేదీ ఆదివారం ఉదయం 9 గంటల నుంచి 6, 7, 8, 9 తరగతుల విద్యార్థులకు భగవద్గీత 14వ అధ్యాయం గుణత్రయ విభాగ యోగంలోని శ్లోకాల కంఠస్థ పోటీలు నిర్వహిస్తామన్నారు. అదే రోజు 10వ తరగతి, ఇంటర్ విద్యార్థులకు 16వ అధ్యాయం దైవాసుర సంపత్ విభాగ యోగంలో పోటీలు నిర్వహిస్తామన్నారు. విజేతలకు బహుమతులు అందిస్తామన్నారు. దేవస్థానం ఆస్థాన విద్వాంసులు ముత్తేవి శశికాంత్, డాక్టర్ చింతలపాటి మురళీకృష్ణ, కె.కె.డి.మహాలక్ష్మి, వడ్లమూడి ఉమామహేశ్వరరావు, జొన్నలగడ్డ మాధవి, మడమల రాంబాబు పాల్గొన్నారు.